శ్రీరస్తు.

# నానారాజన్యచరిత్రము.

ఇది

మచిలీపట్టణస్థ నోబిల్ కళాశాలాంధ్రోపాధ్యాయులును,
చంద్రకాంత, జపానీయము, మార్కండేయవిలాసము,
వాసంతిక, ప్రియదర్శిక, కృష్ణరాయల కొండవీటివిజయము
మున్నగు గ్రంథములకు కర్తలును

నగు

శ్రీరామ్ వీరబ్రహ్మము గారిచే


రచియింపఁబడి

శ్రీ వేంకటగిరి సంస్థానాధీశ్వరు లగు
శ్రీ రాజా వెలుగోటి గోవిందకృష్ణయాంచేంద్ర బహదరువారి
యంకితముగఁ

ప్రకటింపఁబడియె.

1918.

*Copy right reserved.*] [PRICE Rs. 3



గ్రంథకర్త:
శ్రీరామ్ వీరబ్రహ్మము, మచిలీపట్నము.

# Nana Rajanya Charitramu

Dedicated

Most Respectfully

To

SRI SRI SRI RAJAH VELUGOTI
GOVINDA KRISHNA YACHENDRA
BAHADAR GARU
RAJAH OF VENKATAGIRI

With Kind Permission

BY

THE AUTHOR.

శ్రీరస్తు.

# వాసిరెడ్డి సంస్థానము.

(ముక్త్యాల; కృష్ణాజిల్లా)

—♦ చతుర్దశదళపద్మబంధసీసము ♦—

వినుతరసత్క్రియా ♦ వేశుల రయి భవ్య
    విద్యాలయము భువి ♦ వెలయఁ జేసి
గురుప్రేమ సార మా ♦ గుణమిచ్చు దివ్యౌష
    ధాళిఁ జేయించి ధ♦ర్మార్థ మిచ్చి
శ్రీకర మాచంద్ర♦సేవితవరాకృతుల్
    బల్మారుఁ గోంచుఁ గృ♦పాసముద్ర
ధీరమ్యవరా భాగ్య ♦ దేవిచేఁ గవిలోక
    మండలిఁ బ్రోచు రా♦న్మాళి వార

తే.గీ. సుప్రసిద్ధతావకకథా♦సూక్తి వేఱ
    యేల వర్ణింప సాదర♦హృదయ! సర్వ
    జగ మెఱుంగుద్విజాళికి ♦ జందె మేల?
    భూరిరక్షాపరాయణ ♦ భూమిరమణ!.

ఈ జమీకి ముఖ్యపట్టణముగా నుండిన 'ముక్త్యాల' యందొక దుర్గమును, రాజకుటుంబనివాసమున కొక రమ్యహర్మ్యంబును గట్టబడియుండెను. ఆపట్టణపార్శ్వభాగంబున నెక్కుడు వైశాల్యంబుగలిగి తన నిర్మలవారిపూరంబుచేఁ జూపరులకు నేత్రానందసంధాయకంబగు



కృష్ణాతరంగిణి ప్రవహింపుచుండును. బెజవాడనుండి హైదరాబాదునకుఁ బోవుచున్న ధూమశకటకారణంబున వ్యాపార విషయాదులయందుఁ బ్రస్తుతకాలంబునం దత్యంతమగు తనయశస్సును బోఁగొట్టుకొనినను గొండొకకాలంబున మిగులఁ బ్రఖ్యాతివహించిన జగ్గయ్యపేట కాలుమైళ్ళదూరమునఁగల యొకచట్టు నేలపై నిది కట్టఁబడి కృష్ణాభవానిచే ముద్దులాడఁబడు చుండెను.

వ్యాఘ్రభల్లూకాది యాటవికజంతుపాలనాధిగతం బై, వివిధ తరునిబిడం బై, మానవసంచారశూన్యం బై యున్న యొక యారణ్యక ప్రదేశమునందలి పూర్వోక్తవర్ణనంబున కొంకింతవ్యత్యస్తముగల యొక భాగంబున "నల్లుట్ల, వాసివి, కలకట్ట" అను గ్రామంబులను రమారమి యెనమన్నూరు సంవత్సరములక్రిందట వేమనృపాలుని యనుగ్రహంబున 'వాసి' యని పిలువఁబడు నొక రాజకుటుంబీకులు స్వాధీనమొనరించుకొనిరి. ఈ వాసికుటుంబమువారు తమ కేవలసత్త్వసామర్థ్యంబులచే మఱికొన్ని గ్రామంబుల నేర్పఱచుకొని సామీప్యమునఁగల కొందఱరెడ్ల పరిచయమును సంపాదించుకొని తత్సాహాయ్యముచేఁ దమ యేలుబడిని శాంతయుతముగ నేలుకొనఁగలిగిరి.

ఆ రెడ్లును నెక్కుడుజమీనులను సంపాదించుకొని యౌన్నత్యదశకు వచ్చుచుండఁగా వారికి లోఁబడియుండిన సమర్థులగు రైతులలోఁ గొందఱు తమశిస్తుదస్తులను జెల్లించుటలోఁ దడవుసేయసాగిరి. ఇట్టిస్థితియందు వారు సమరాభిముఖులై పరస్పరాభిఘాతంబులచే రక్తప్రవాహంబులఁ బాఱింపఁ జేయుటకు మాఱుగ నిరుకక్షులయందునుగల యోధవరులలో నిరువుర నేరి యాయోధవరు లిరువురును బోరాడునట్లును, వారిలో జయమునొందిన వానిపక్షమువారపజయమునొందినవాని పక్షమునఁగల వారిసర్వస్వమును స్వాధీనమొనరించుకొననగునట్లును దీర్మానించుకొనిరి. దీనినే 'తులారణ'మని యందురు. ఇట్లీరెడ్డినాయకులు రెండుభాగములుగా వీడి నిలువఁబడిరి. కాని యాధభూపతియను ప్రముఖుఁడు తనపక్షమువారియందు సమర్థుఁడగు

యోధవరుఁడు లేకుండుటచే నతఁడు మిత్రసాహాయ్యమర్థింపనుండెను. ఇంతలో నీనిమిత్రుండును, 'వాసి' కుటుంబీకుఁడును నగు 'సదాశివ రెడ్డి' యనునతఁడు తనసైదంబుల నెఱపి తానొక్కఁడ శత్రుమూకలఁ బాఱఁద్రోలఁ గలుగుదునని యభయమిచ్చి తక్షణమే సమరసన్నాహాలంకృతుండయి రణరంగంబునందు బ్రవేశించెను. అంతట రెండవ తెగయందుండియు నొకనాయకుఁడేతెంచి సంగరారంభ మొనరించెను. వారిట్లాయుధపాణులై కొంతతడవు పోరుసరికి విజయలక్ష్మి సదాశివుని కరగ్రహణ మాసించెను. కాని పూర్వోక్తనిబంధనలకు వ్యతిరేకముగా నొకరితరువాత నొకరుగా నెనమండ్రుయోధులు మనసదాశివునకు వ్యతిరేకముగావచ్చి పోరియును సదాశివుని బలపరాక్రమాతిశయంబులకు వెన్నిచ్చి పారవలసినవారైరి. అంతటఁ బూర్వనిబంధనానుసారముగ శత్రుసామ్రాజ్యము నెల్ల నాథభూపతి, స్వాధీన మొనరించుకొని సదాశివునిచేఁ జూపఁబడిన యసామాన్యధైర్యసాహసాదులకు గరంబలరి కొన్ని మిరాశీభూములను, జమీల నొసంగి, 'భాసవశంకర' అనుబిరుదముతోను, సామాజతురంగాది రాజోచితచిహ్నంబులతోను గౌరవించెను. ఈవిధముగ రెడ్డికులనాయకుండయిన యానాథభూపతికి 'వాసి' గొనివచ్చిన మనసదాశివయ్యగారంతటనుండి 'వాసిరెడ్డి' అను గౌరవమునుగూడ వహింపఁగలిగిరి. కావున నాఁటనుండి నేఁటిదనుక నీసదాశివయ్య వంశీకులు 'వాసిరెడ్డివా' రని వ్యవహరింపఁబడు చుండిరి.

సదాశివయ్య కీరీతిఁ దనబాహుబలపరాక్రమముచే నౌన్నత్యము లభించెనేకాని జీవితంబు మేఘమాలలోని విద్యుల్లతవోలె క్షణభంగుర మయ్యెను. అతనిచేఁ దరుమఁబడిన శాత్రవులు దమహృదయగహనంబులందు ప్రజ్వరిల్లుచున్న పరాభవానలంబుచే నుక్కుదక్కియును, బరాక్రమశూన్యులగుటచే సదాశివునెదుటఁబడి పోరాడఁజాలక యొకానొక నిశీథసమయంబున రహస్యవృత్తిఁ బ్రవేశించి స్త్రీయనక, శిశువనక యాబాలగోపాలమును దమ కఱకుకత్తులకు బలియిడుకొని యందుఁగల సమస్తంబును సంగ్రహించుకొని పోయిరి. ఘోరావహంబగు నీకథతో నీవంశ మంతరింపవలసినదే కాని పవిత్రచరిత్రంబున కాకరుం



డగు 'గిరిమల్లిఖార్జుననాయుఁడు' అనునామధేయంబుగలిగి రెండేండ్లయీడుగల యొకపుత్రునితోఁ గూడ సదాశివరెడ్డిభార్య, యచ్చటికనతిదూరంబునఁగల తనపుట్టినింటనుండుటచేఁ బ్రాణంబులదక్కించుకొనఁ గలిగి వంశాధారమునకుఁ గారణముగల్పింపఁగలిగెను. ఈ వనితావతంస మాదుర్భరదుఃఖవార్తను వినుటతోడనే తనభర్త ననుగమింప నిశ్చయించుకొనెను; గాని యట్లు ప్రాణపరిత్యాగ మొనరించుకొనుటకు ముందు తనపసిబిడ్డనుజూచి జాలిపడి యదృష్టహీనుఁడగుదన భర్తకుఁ దటస్థించినగతియె వానికిదటస్థించునేమోయని సంశయమొదవుటచేఁ దనకుఁ బ్రాణసమానురాలయి, యాంతరంగికురాలగు నొకబ్రాహ్మణస్త్రీని బిలిపించుకొని యామెకు దనదురవస్థ నెల్ల నెఱింగించి దిక్కులేని తనబిడ్డను, వానిసంరక్షణమునకుఁ జాలిన యాస్తితోఁ గూడ నామెచేతిలోఁ బెట్టి యాబిడ్డను దనసొంతబిడ్డవలెఁ బెంచుచు విద్యావంతునిగఁ జేసి వానికుటుంబమునకును, రాజ్యమునకును దటస్థించిన యీ యనివార్యమగు దురవస్థను వానిశైశవానంతరంబున వానికెఱింగించునట్లా బ్రాహ్మణినుండి వాగ్దానమును బొందినపిమ్మట శ్మశానవాటికకుంబోయి యందు చితిపేర్చుకొని పంచత్వంబునొందెను.

ఇట్లు దిక్కులేని యాబిడ్డను దయాంతరంగయగు నాబ్రాహ్మణాంగన గుంటూరు జిల్లాలోనిదగు నూతక్కి గ్రామంబునకుఁ గొనిపోయి యందు వానిని దన కన్నబిడ్డకంటె నెక్కుడు ప్రేమానురాగంబులతోఁ బోషింపుచుండెను. కులవ్యత్యస్తంబునైనఁ బాటింపక యటుల రెండేండ్ల యీడుగల యాబాలుని బెంచుటలో నామెకుంగల సహజౌదార్యగుణంబు లెంతయు స్తుతిపాత్రంబు లగునుగదా! ఔదార్యగుణవిశేషంబులందేగాక దైవభక్తియందును బెద్ద యగుటచే నట 'శక్తీశ్వరస్వామి' పేర నొకదేవాలయంబును గట్టించి యందు సుఖజీవనంబు సేయుచుఁ, దన పాల్బడియున్న గిరిమల్లిఖార్జునుని మిగుల జాగరూకతతోఁ బెంచి పెద్దవానినిగఁ జేసి విద్యాప్రావీణ్యునిగఁ గూడఁ జేసెను. ఇట్లు క్రమక్రమాభివృద్ధిగాంచిన వానికి, వానికుటుంబీకులకుఁ దటస్థించిన దుర్భరానర్థకంబు నెఱింగించి, వానికడనే యామె తనజీవితావసా

నంబును గడపెను. అంతట మల్లికార్జుననాయఁడు తనవంశక్షయంబునకును, రాజ్యభగ్నత్వంబునకును గారకు లగు శత్రురాజుని నిర్మూలించి తమపూర్వప్రతిష్ఠను బ్రతిష్ఠింప స్వస్థానంబున కేఁగఁ గృతనిశ్చయుఁ డగు చుండెను. ఇంతలో వాని యిష్టదైవం బగు శక్తీశ్వరస్వామి యొకనాఁటిరాత్రి వృద్ధబ్రాహ్మణాకారంబున స్వప్నావస్థ యందు సాక్షాత్కరించి "... ఇట్టి సాహసోద్యమంబుల కిది సమయంబుగాదు. ఇంక నీస్థలంబునందె నివసించి యుంటివేని, నీవును, నీకుటుంబీకులును నభ్యున్నతస్థితికి రాఁ గలరు. మఱియు నీ వొకరాజ్యంబున కధీశుండవును గాఁ గలవు. ..." అని భక్తవత్సలుం డగుభగవంతుఁ డాజ్ఞాపించి యంతర్హితుం డయ్యె. అంత నతండు మేల్కాంచి దైవాజ్ఞలను శిరసావహించి తననిశ్చితంబులను విడిచిపెట్టి యందె నివసించు చుండెను. అంత నచిరకాలంబుననే తనదైవభక్తితోఁ గూడిన సచ్ఛీలత్వంబునను, యోగ్యవర్తనంబునను బురోభివృద్ధి గాంచఁ గలిగి తత్ప్రాంతంబునఁ గల యొకకన్యారత్నంబును బరిణయమై సుఖంబుగఁ గాలంబును గడపు చుండెను.

ఈ వాసిరెడ్డికుటుంబీకులలోఁ గొందఱు కొండవీడుసీమలోని కొన్ని గ్రామంబులను స్వాధీన మొనరించుకొని తమలోఁ దామైకమత్యముం గలిగి తమకార్యక్రమమును జక్కఁగ నెఱవేర్చుకొను చుండిరి.

కొన్ని సంవత్సరములు గతించినపిమ్మట నీ వాసిరెడ్డికుటుంబీకులలోఁ బ్రాముఖ్యుఁడును, ధైర్యోత్సాహంబులు గలవాఁడును నగు చంద్రమౌళీశ్వరుఁడుగా నొకశాశ్వతరాజ్యంబును స్థాపింప నుత్సుకంబు గలవాఁ డయి పట్టణరాజంబుగ నుండిన హైదరాబాదునకుఁ బోయి యచ్చటఁ గొంతసైన్యమును సమకూర్చుకొని నవాబుగారిసుబేదారుని దర్శించి యుచితగౌరవాదులర్పింపుచు వానికడ యోధవీరోచితకృత్యంబులనుష్ఠింపు చుండెను. ఆసుబేదారుఁడును వీనియనువర్తనంబున కానందించి యమితానురాగంబు గలవాఁ డయి కొన్ని బహుమానంబులతోను, నూతక్కి, తాటికొండ, మఱికొన్ని గ్రామంబులును గలిగిన



యొకజాగీరుతోడను సత్కరించి పంపెను. ఈవిధముగాఁ బాలనాధికారంబును వహించిన మన చంద్రమౌళీశ్వరునికుటుంబములోఁ గొన్ని తరంబులు గడచినపిమ్మట వీరప్పనాయఁడనునతఁడు ప్రాముఖ్యుఁడును బుత్రవంతుఁడును నై యుండెను. వీనిపుత్రులలో 'రాఘవయ్య, రామన్న, చంద్రమౌళి' అనువారలు కార్యనిర్వహణసామర్థ్యంబు గలవా రయి ధైర్యసాహసోత్సాహాదులం దద్వితీయులై యుండుటచే విస్తీర్ణంబైన సామ్రాజ్యంబును స్థాపింప నెంచి యెట్టిశ్రమల కైన వెనుదీయనిపట్టుదలతోఁ బ్రయాణోన్ముఖులై తమకుం గలస్వల్పసైన్యంబుతో ఢిల్లీపట్టణంబునకుఁ బోయిరి. అట్లు మన రాజసోదరులు మువ్వురును ఢిల్లీపట్టణమునందు 1628 సంవత్సరమునుండి 1658 సంవత్సరము వఱకును బరిపాలించు చుండిన షాజహాన్‌చక్రవర్తిని దర్శింపఁ బోయి యచ్చటఁ జక్రవర్తిదర్శనార్థమై బహుకాలము నిలువవలసినవారైరి. ఈమధ్యకాలంబులో వారచ్చటఁ గల గొప్ప యుద్యోగీయులతోడను, నధికారులతోడను, సేనాధిపతులతోడను మైత్రి సంపాదించుచుండిరి. ఇట్టి సందర్భమునందు చక్రవర్తియొక్క సుబేదారులలోఁ గొందఱు తాము జెల్లింపవలసిన కప్పంబులను సరిగఁ జెల్లింపక తిరగబాటొనరించుటచే షాజహాన్‌చక్రవర్తి తన సైనికులకు వారిపై దాడి వెడలుట కాజ్ఞాపించెను. చక్రవర్తియాజ్ఞచే యోధవీరులు బైలుదేరిరి. వారితోఁ గూడఁ దమస్వల్పసైన్యమును వెంట నిడుకొని చంద్రమౌళి, రామన్న, రాఘవయ్యలు ప్రభ్వాజ్ఞను దమకుఁదామే పైనిడుకొని సైనికోద్యోగీయుల కానంతేని శ్రమ గలిగింపకుండ రణోన్ముఖులై వెడలి శత్రురాజుని నెల్ల నానుమాడఁ గలిగిరి. అంత చక్రవర్తియుద్యోగీయులు జయజయధ్వానులతోఁ దమ మిత్రత్రయంబును వెంట నిడుకొని ఢిల్లీకి వచ్చి చక్రవర్తికీ మువ్వురపరాక్రమంబును విశదీకరించిరి. షాజహాయును మిగుల సంతసించి వారికమూల్యంబు లగు బహుమానంబులును, గొన్ని రాజోచితాలంకారంబులును గాక నందిగామపరగణానుగూడ నొసంగి వారి ననేకరీతుల గౌరవించి పంపించెను. అంత వారు స్వపురాభిముఖులై యేతెంచి

సంస్థానంబును జక్కఁగఁ బాలించుకొనుచు, నూతనగ్రామంబులను నెలకొల్పుచు, దుస్తరంబయిన దారుణాటవులను ఛేదించి నివాసార్హంబులగు నట్లొనరింపుచు, నింక నెన్నియో దేశక్షేమకరంబు లగుసదుపాయంబుల నొనర్చిరి.

వీరు, హైదరాబాదుసుబేదారుని దర్శించి తమజమీలోఁ దము మువ్వురకును సమానభాగాధికారము లుండునట్లు పట్టాలను బొంది 1686 వ సం॥లో నందిగామజమీని దమమువ్వురకును మూఁడుభాగములుగ భాగించుకొనిరి. అందులో రాఘవయ్యగారు మాగల్లునందును, రామన్నగారు రాఘవపురమునందును, చంద్రమౌళిగారు చింతలపాడునందును బలిష్ఠములైనకోటలను గట్టుకొని చక్కఁగఁ దమ సామ్రాజ్యంబు నేలుకొనసాగిరి. కావున వాసిరెడ్డివారిచరిత్రము ననంగాఁ బరస్పరసంబంధ ముండుటచే నీమువ్వురచరిత్రములును వర్ణింపవలసి యున్నది; కాని ద్వితీయుఁడును రాఘవపురాధిపతియును నగురామన్నగారికుటుంబ మల్పకాలములోనె యంతరించి పోయెను. వీని కార్వురుపుత్రులు గలరు. వారిలో నగ్రజుఁ డగువీరపనేఁడు సూరన్న యను నొకకుమారుని గాంచెను. ఈయనకుఁ జినసరసింహాము చినరామలింగము నను నిరువురుపుత్రులు గలరు. ఈ చినరామలింగమే చల్లపల్లి జమీందారు లగు యార్లగడ్డకోదండరామన్నగారి జామాత యని తెలియవచ్చెడిని. ఈ చినరామలింగన్నగారు సంతానహీను లై 1760 వ సంవత్సరమున స్వర్గస్థు లైరి. అంత వీరిసంస్థానము, మాగల్లున కధిపతి యగు రాఘవయ్యగారి సంతతికిని, చింతలపాడు నేలు చంద్రమౌళిగారి సంతతికిని సంక్రమించెను.

ఇఁక మాగల్లుసంస్థానమునుగురించి విచారింతము. అసమానపరాక్రమవిక్రమవంతుఁడును, జగద్వ్యాపితచరిత్రుఁడును నగు శ్రీరాజావాసిరెడ్డి వేంకటాద్రినాయుఁడు బహదర్, సర్ దేశముఖ్ మన్నె సుల్తాన్ గారు పాలించిన దీసంస్థానమునే. కావున నిదియుఁ గొంత విపులచరిత్రమే యగును. అట్లగుటచే దీనిని; దమ 'వాసి' కొఱంతవడకుండునట్లిప్పటివఱకు వాసిరెడ్డివంశపయోధిసుధాకరు లనం దగు మనప్రస్తుత



శ్రీరాజావాసిరెడ్డి చంద్రమౌళీశ్వరప్రసాద్ నాయుఁడు బహద్దర్ సర్ దేశముఖ్ మన్నెసుల్తాన్ గారుపాలించుచున్న చింతలపాటివంతు సంస్థానచారిత్రంబును వర్ణింపవలసియున్నది.

మాగల్లును బాలించు రాఘవయ్యగారి యేకపుత్రుఁ డగు పెదపద్మనాభుఁడు ఢిల్లీశ్వరునియొద్దకు ప్రతిభువు (Hostage) గఁ గొంపోవఁబడి యచటనే బహుకాల ముంపఁబడె ననియు, నంత నొకనాఁ డీయన యంతికోద్యానంబునఁ గురుల సవరించుకొనుచు విహరించుటను గవాక్షమార్గంబునుండి కాంచిన రాణివాసజనంబులో నొకతె వాని సహజసౌందర్యంబున కచ్చెరువుంది యుండుటచేతనో, లేక దేదీప్యమానంబులగు నమూల్యరత్నవితతిచే రచితమైన యొక చక్కనియంగీని నంతఃపురస్త్రీజనంబునకు బహుమతిగఁ బంపుటచేతనో, వారిచే పాదుషాను దర్శింపఁ గలిగి, పిమ్మట పాదుషాచే నొసఁగఁబడిన యొక యస్వాధీనతురంగంబును దనసామర్థ్యంబుచే స్వాధీన మొనరించుకొని యొక్క యహోరాత్రము దానిపై స్వారిజేయ నది నురుగులు గ్రక్కుచు మడియుటచే పాదుషా వీని నిరుపమాన సామర్థ్యంబున కబ్బురపడి 'పెనుగంచిప్రోలు' బేతవోలు గ్రామములకును, బూర్వపు మాగల్లునకును బట్టా నొసఁగి పంపె ననియు నొకచిత్రకథ యున్నట్లు మెకంజిదొరగారు వ్రాసి యున్నారు.


1710 వ సంవత్సరమునందు, కొండవీడుసర్కారు నందుఁ గల సత్తెనపల్లిజమీందారులకును, రేపల్లిజమీందారులకును గలహములు ప్రబల ముగుటచే దక్కనుసుబేదారు (Governor of Duccan) తన యెకిమీ డగు నార్కాటునవాబున కప్పగింప నాయన యీమండలమునుండి పోవుచు రేపల్లిజమీందారుఁ డగుమాణిక్యారావుగారియొద్దనుండి కొండవీడుసర్కారును దీసికొని దానిలో మూఁడవభాగమునకు మన వాసిరెడ్డివారి నఫీశులుగఁ జేసి నవాబు తన యార్కాటునకుఁ బోయెను. ఇట్లు కొండవీడుసర్కారునందలి మూఁడవభాగము మన పెదపద్మనాభునకే వచ్చె ననియు, నీయనయే చింతపల్లియొద్ద నొకకోటను గట్టెననియుఁ జెప్పుదురు.

మాఁగల్లు నేలిన రాఘవయ్యగారి పుత్త్రుఁ డగు నీయనను మెకంజిదొరగారు 'చినపద్మనాభుఁ'డని వ్రాసినారు, కాని "తే. గీ. వారిలోపల శ్రీరాఘవయ్యసుతుఁడు । దనరఁ బెదపద్మనాభుఁ డ న్ధరణివిభుఁడు । చంద్రచందనకుందాబ్జ సదృశకీర్తి । యగుచు విలసిల్లె భూవలయంబునందు॥" అను పద్యమువలనఁ బెదపద్మనాభుఁ డనియు, ఖ్యాతి నొందిన రాఘవపురీశుఁ డగు రామయ్యగారి తృతీయపుత్త్రుఁడు—"ఉ. వీరవరేణ్యుఁడు రాఘవుఁడు విశ్రుతుఁ డౌ చినపద్మనాభుఁడున్" అను పద్యపాదమువలనఁ జినపద్మనాభుఁ డనియుఁ దెలియుచున్నది. కావున మనము పైపద్యానుసారంబుగనే వ్యవహరించితిమి.

అట్లభ్యున్నతస్థితికి వచ్చిన పెదపద్మనాభన్న కార్వురుపుత్త్రులు గల రనియు, వారిలో నాగన్న యనునాయన రాజ్యభారము వహించె ననియు నీక్రిందిపద్యము చెప్పుచున్నది:—"ఉ॥ ఆ పరవీరసంహరున కార్వురుపుత్త్రులు పెద్దరాఘవ । లక్ష్మీపతి చంద్రమౌళి యరిమర్దనరామనృపాలకుండు, లక్ష్మీపతి, నాగనాహ్వయుఁడు జల్వగు బుచ్చన నాగ వారిలో । భూపతిమౌళి నాగన ప్రభుత్వముచేసెఁ జిరంబుగా ధరన్." ఖ్యాతి నొందిన రాఘవపురమున కధిపతి యైనట్టియు, 1760 వ సంవత్సరమునందు గతించినట్టియు రామలింగన్నగారికి నాగన్నగారు దత్తపుత్త్రుఁ డగుటచేతనో లేక తన బాహుబలపరాక్రమముచేతనో యెక్కుడు ప్రఖ్యాతినివహించి రాజ్యవిస్తారమును గాంచఁ గలిగెను.

ఇఁకఁ జింతలపాటిచరిత్రమునకు వత్తము. ఈ చింతలపాటివంతున కధీశ్వరులు చంద్రమౌళిగారని చదివి యుంటిరిగదా! వీరికి రాఘవయ్య యనునొకపుత్త్రుఁడు గలఁడు. ఈ రాఘవయ్యగారు కత్తిసామునందును, విలువిద్య యందును, గుఱ్ఱపుస్వారియందునేగాక శరీరవ్యాయామసంబంధ మగుమహాదద్భుతకార్యంబులందును మిగులసామర్థ్యంబును గలిగి యుండెను. ఈయన ఢిల్లీకి పోయి యౌరంగజేబుచక్రవర్తిని దన వ్యాయామనైపుణ్యప్రదర్శనంబుచే సంతసింపఁజేసి యనేకబిరుదములను






బహుమానంబులను జింతలపాటివంతుపై స్వతంత్రాధికార ముండునట్లొకపట్టాను సంపాదించుకొని వచ్చెను. ఈయన పదుమూఁడు సంవత్సరములు పాలించెను. వీని యనంతరమున రాజమౌళి, అచ్చయ్య లేక లక్ష్మీపతి యనునిరుపురుకుమారులలో రాజమౌళిగారు పరిపాలకులైరి. ఈయన యెనిమిదివత్సరములు జమీనుకధీశుఁడుగ నుండెను. సేద్యానుకూల మగునట్లొక పెద్దకాలువను నందిగామనుండి త్రవ్వించెను. ఏలుబడి కనుకూలంబు లగుకార్యంబులనేగాక ధర్మచింతనపరాయణుండై యొనర్చిన పుణ్యకార్యంబులును బెక్కులుగలవు. ఈయనపిమ్మట అచ్చయ్య యను లక్ష్మీపతిగారు పాలకులైరి. ఈయన మాఁగల్లుపురాధిపతి యైననాగన్నగారితోఁ గొంతకాలము కలసిమెలసి యేకముగా రాజ్యపాలన మొనరించినట్లు తెలియవచ్చుచున్నది. ఆకాలములో ననఁగా 1761 వ సం॥ నందు వీ రిరువురకును షాహాఆలమ్ (Shah Alam) చక్రవర్తినుండి నైజాముగారిద్వారా కొల్లూరు, కేతవరము, బెల్లంకొండ, వినుకొండ, రాయపూడి మహాలులును; రావూరు, కూచిపూడి వఱకు గల హవేలి మహాలులును జేర్చి వీనిపై 'మన్నవార్'

అధికారము లభించెను. కాని కొలఁదికాలములోనే యీ యధికారమంతయు నొక్కనాగన్నగారికే చెందెను.

మాగల్లుపురాధిపతి యైన నాగన్నగారికి రామన్న, జగ్గయ్య, నాయఁడమ్మ లేక వేంకటాద్రి యను ముప్వురుపుత్రులు గలరు. వీరిలో రామన్న నందిగామపరగణాకును, జగ్గయ్య చింతపల్లిపరగణాకును బరిపాలకులుగ నుండి బాహుపరాక్రమమునఁ బాలింపఁ దొడఁగిరి. కాని, వీరికాలములోనే జ్ఞాతివైరము ప్రబల సాగెను. చింతలపాటివంతును బాలించిన లక్ష్మీపతియనంతరము, వీనియగ్రజుఁడగు రాజమౌళియొక్క తనయుఁడైన చంద్రమౌళియు, వీని యనంతరమున వీని సుతద్వయం బగు రామలింగన్న, వీరపనీఁడను నిరువురుసోదరులును జింతలపాడును నేలుకొనుచుండిరి.

ఈ రామలింగన్నగారు ముక్త్యేశ్వరపుర మను నామాంతరము గల ముక్త్యాలయం దొకదుర్గమును గట్టుకొని యందే నివాస మేర్పఱచుకొనిరి. వీరపనీఁడుగారికి వీరన్న యనువాఁడుక పేరుగలఁడు. వీరు జగ్గయ్యగారిచే వధింపఁబడిరి. ఈజగ్గయ్యగారును నీ వధజరిగిన పై సంవత్సరములోనే యనఁగ 1764 వ సంవత్సరములో దక్కనుసుబేదారుఁడగు సాలబత్‌జంగుయొక్క సోదరుఁడగు బసాలత్‌జంగుచే నిట్టి యదృష్టమునకే పాల్పడెను.

వీరన్నగారిట్లు వధియింపఁబడినపిమ్మట రామలింగన్నగారీవిషయమై వినినప్పుడు మిగులఁ గ్రోధోదగ్రమానసుఁడై దివాకర సుబ్బన్న యను నొకవకీలును హైదరాబాదునకుఁ బంపెను గాని పాప మీ న్యాయవాదిగారును దురాశావేశులై యున్న యరివర్గముచే మార్గమధ్యంబుననే నిరోధింపఁబడి నిర్హేతుకంబుగ వధింపఁబడిరి. లోభగుణ మెట్టిపాపకార్యంబుల కైన వెనుదీయ నీయదు కదా! అట్లు ఘోరారణ్యంబున వధింపఁబడి కళేబరము సమీపమునఁ బాఱుచున్న కృష్ణానదిలోఁ బాఱవేయఁబడెను. భర్తమరణంబు నాలించిన మీనాక్ష



చంద్రమౌళి (చింతలపాడు).

- రాఘవయ్య
  - రాజమౌళి
    - చంద్రమౌళి
      - రామలింగన్న
        - రాజమౌళి
        - లక్ష్మీపతి
        - రాఘవయ్య
        - చంద్రమౌళి
          - చినవేంకటాద్రి
            - భవానీముక్త్యేశ్వరప్రసాద్
              - ఉమామహేశ్వరప్రసాద్
              - వేంకటాద్రి
                - శ్రీరాజా చంద్రమౌళీశ్వరప్రసాదనాయఁడు బహదర్ గారు. (ప్రస్తుత ముక్త్యాలసంస్థానాధిపులు.)
            - చంద్రమౌళిప్రసాద్
            - సదాశివప్రసాద్
        - వెంకన్న
      - వీరపనీఁడు లేక వీరన్న (Died in 1763.)
  - అచ్చయ్య లేక లక్ష్మీపతి

మ్మ బిట్టు వగచుచుఁ దానును దనభర్తతోఁ పాటు జీవయాత్రను గడప నిశ్చయించుకొనెనుగాని దయార్ద్రహృదయుఁడగు రామలింగన్నగారు ప్లీడరు సుబ్బన్నగారికిని వారికుటుంబమువారికిని వాటిల్లిన యనర్థకంబునకు మిగులఁ జింతించి మీనాక్షమ్మతో 'నిన్నును నీసంతతి వారిని శాశ్వతముగ సంరక్షించుచుండెద' మని వాగ్దానమొనరించి యాదరించిరి. రామలింగన్నగారికి తరువాతవచ్చినవారు కూడ నీ వాగ్దానమును నేఁటివఱకును నెఱవేర్చుచుండిరి. ఇట్లా సుబ్బన్న

గారియనంతరము రామలింగన్నగారు బందరువిస్సన్న యనుమఱియొక వకీలును ఢిల్లీకి ప్రయాణము జేసి పంపించిరి; కాని యాప్లీడరునకును బూర్వోక్తదుస్థితియే తటస్థించెను. ఇట్లు కల్లోలములు ప్రబలముగ నున్నకాలంబున రామలింగన్నగారి ద్వైమాతురు పుత్రులలోఁ బ్రథముఁడగు రాజమాళిగారు దక్కనుసుబేదారుఁడగు సాలబత్ జంగును దర్శించి తమకష్టదశను విన్నవించుకొనిరి. ఆసందర్భములోనే నవాబుగారి పశ్చిమతీరవాసు లగు కొందఱు జమీందారులు తమకప్పముల సరిగ నొప్పగింపక తిరుగఁబడుటచేఁ దత్క్షణము వారిని శిక్షించుటకై సంపూర్ణాధికారంబుతో మనరాజమాళిగారిని నవాబు పంపుటచే నారాజమాళిగారును సంపూర్ణవిజయులరయి తిరిగివచ్చి సంతసించిన నవాబానందపరవశుఁడై రాజమాళిగారికిఁ 'రాజా, బహదర్' అనుబిరుదములను గొన్ని రాజలాంఛనములను భ్రష్టమైనజమీపై నొకపట్టాను నొసంగెను. అంత రాజమాళిగారొకసంవత్సరముమాత్రము రాజ్యమేలి పిమ్మట యవివాహితుఁడుగనే స్వర్గముఁ జేరెను.

1761వ సం॥ ఫిబ్రవరినెలలో 'ప్యారిస్' (Paris) పట్టణమునందుజరిగిన యొడంబడికవలన సాలబత్ జంగు దక్కన్ సుబేదారుఁడగుటను విని వీనిసోదరుఁడగు నైజామ్ ఆలి 1761 జూలై 18వ తేదిని సాలబత్ జంగును వధించుటచే నీ రాజమాళిగారును దాదాపుగ 1761 సంవత్సరప్రాంతము నందే గతించియుందురు.

అట్లా బసాలత్ జంగుచే వధింపఁబడిన జగ్గయ్యగారి మరణవార్తను విని వీరిసహధర్మచారిణియుఁ బరమపతివ్రతామణియు నగు అచ్చమ్మ నిశ్చేష్టితురాలయి తనచేతిలో నున్న సువర్ణకంఠహారమును నావలఁ బాఱవైచి తాను సహగమన మొనరించెను. ఇదియే మన కృష్ణాజిల్లాలో జరిగిన కడసారిసహగమనము. ఈ పతివ్రతామణి సహగమనజ్ఞాపకార్థముగ నీవంశమువా రిప్పటికిని గంఠహారముల ధరింపకుందురు. మఱియు నీసాధ్వీమణి పవిత్రనామ మవనిపై నాచంద్రా

Kristna District Manual Page 71.



ర్కంబుగ నుండునట్లే యమ్మగర్భశుక్తిముక్తాఫలం బనం దగిన శ్రీరాజా వేంకటాద్రినాయఁడుగా రామెపేర గుంటూరుజిల్లాలో 'అచ్చమ్మపేట' అను నొకగ్రామమును గట్టించిరి. మఱియు నీయన తనతండ్రిపేరఁ గూడ 'జగ్గయ్యపేట' యనుగ్రామమును గట్టించెను. మఱియుఁ దనపేరిటఁ గూడ 'రాజాపేట, మన్నెసుల్తాన్ పేట, నాయనిపేట లను గట్టించినట్లు శ్రీకాంచీమహాత్మ్యములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది—

"సీ. తతదానధర్మాస్ప♦దం బౌచు లక్ష్మిచే
ఘనతరం బైన జ♦గ్గయ్యపేట
తనతండ్రిపేరిటఁ ♦ దనరారఁ గట్టించి
తల్లిపేరిట మహా♦దానధర్మ
సదనమై నట్టి య♦చ్చమ్మపేటను వేడ్కఁ
గట్టించి నిజనామ♦కలితముగను
ఘనతరాజాపేట♦యును మన్నెసుల్తాను
పేటయు నాయని♦పేట యనఁగఁ
తే. గీ. బట్టణంబులఁ గట్టించి ♦ ప్రబలఁ జేసె
నాలుగాశ్రమధర్మముల్ ♦ నడపి యంత
స్వర్ణగోపుల నిర్మించి ♦ సద్ద్విజాళి
కవి యొసంగెను శ్రీవేంక♦టాద్రివిభుఁడు.'

వీరివిషయమై ముందు చెప్పఁబడును. అట్లు జగ్గయ్యగారియనంతరమున నీయనయగ్రజుఁడగురామన్నగారు రాజ్యవిశేషము నంతయుఁ దనస్వాధీనములోనే యుంచుకొని కనిష్ఠసోదరుఁడగు వేంకటాద్రిగారికి నందిగామ నిచ్చి తాను చింతపల్లియం దుండెను; గాని కొలఁదికాలములోనే యనంగా 1770 సం॥లో సాలబత్ జంగుసోదరుఁడగుబసాలత్ జంగున కయిష్టుఁడగుటచేఁ జింతపల్లికోట ముట్టడింపఁబడెను. ఈ బసాలత్ జంగు తత్కాలంబునందు, ప్రబలమైనఫ్రెంచిసైన్యముతో గుంటూరునందు మహోన్నతదశ యందుండెను. ఇట్లుండ ఫ్రెంచి సైన్యాధీశుఁడగు 'బోన్ ఎన్ఫాన్టు' (Bon Enfant) అనువానిచే

ముట్టడింపఁ జేసిన చింతపల్లిని, మన చింతలపాటి సంస్థానాధిపతులును 1763 వ సం॥లో వధింపఁ బడిన వీరన్నగారి యగ్రజులును నగు రామలింగన్నగారి పుత్రపంచకములో నగ్రజుఁడగు రాజమౌళిగారికి 1771 వ సంవత్సరములో నొసఁగుటయేకాక 'రాజా' యను బిరుదము నొసంగి, దాదాపుగ వాసిరెడ్డి సంస్థానమున కంతకును జమీందారునిగఁ గూడఁ జేసెను. ఇదియె, యీ రెండుశాఖలవారికిని గలవైరానలంబున కొక యింధనంబుగఁ బరిణమించెను.

బసాలత్ జంగున కిష్టుఁడైన రామన్నగారును, వారి కనిష్ఠ సోదరుఁడగు వేంకటాద్రిగారును బ్రిటిష్ రాజ్యములోని దగు నందిగామయందె యుండి యాపరగణానుమాత్రమె పాలింపుచుండిరి. అంత వేంకటాద్రిగారు 1772 సం॥లో నందిగామయందే యుండఁగాఁ దాను పాలింపుచున్న తనసంస్థానమునందే గతించిరి. అంత నాలుగు సంవత్సరముల వయస్సుగల వేంకటాద్రిగారితనూజుఁ డగుచంద్రమౌళి యను నొకబాలుఁ డుండినను రామన్నగారు నందిగామకు తానే యధిపతిగాఁ జూచెను. మదరాసుదొరతనమువారుకూడ నిసోదరసంతతికి మనువృత్తి నిచ్చు నొడంబడికమీఁద రామన్నగారిని నందిగామ కధీశులుగఁ జేసిరి. కాని యీరామన్నగారు 1778 వ సంవత్సరమునఁ బరమపద మందిరి. పిమ్మట రాజ్యమునకు రాఁ దగినది వీనియాత్మజుఁ డగు నాగన్న యనెడి పాపయ్యగారే యయినను జగదేకప్రఖ్యాతచారిత్రుఁడును, నిరుపమానపరాక్రమవంతుఁడును నగు రాజా వేంకటాద్రినాయఁడు రా జయ్యెను. ఈయన రామన్నగారి ద్వితీయసోదరుఁ డగుజగ్గయ్యగారికుమారుఁడు. ఈయన రాజ్యమునకువచ్చిన తోడనే తనయధికారమును నిరంకుశముగ సాగింప నెంచి తన పిన పెద తండ్రులతనయులగు చంద్రమౌళి, నాగన్న యనెడి పాపయ్యగార్ల నస్వాతంత్ర్యులుగఁ జేసి చింతపల్లికోటయం దుంచెను: గాని పిమ్మట వీరితనయులనే దత్తపుత్రులనుగ స్వీకరించి తన యశేషసామ్రాజ్యంబు నొసంగియుండుటచే వీరికి శత్రుఁడుగాక మిత్రుఁడే యయ్యెను.



శ్రీరాజా వేంకటాద్రినాయఁడుగారు తన బాహుబలపరాక్రమముచే నసహాయశూరుఁడై నలుదెసలఁ దన ప్రతాపానలంబును బ్రవేశపెట్టఁ జూచుచుండెను. ఇంతలో నీకుటుంబమునకుఁ దొలినుండియుఁ గంటకుఁడుగ నుండిన బసాలత్ జంగ్ సమసిపోయెను. ఇఁక నైజా మన్ననో దూరస్థం బగు సికందరాబాదునం దుండును. కావున నీవేంకటాద్రినాయఁడుగారి ప్రతాపానలము ప్రచండముగఁ బ్రజ్వరిల్ల సాగెను.

చింతలపాడుసంస్థానాధీశులగురాజమౌళిగారు, బసాలత్ జంగుచే 1771 వ సంవత్సరములోఁ జింతపల్లి సంస్థానములోని విశేషభాగమునకును ప్రభు వయ్యె నని చదివి యుంటిరిగదా! ఈరాజమౌళిగారి యనంతరమున వీని ద్వితీయసోదరుఁ డగు లక్ష్మీపతిగారు రాజ్యపాలనమునకు వచ్చిరి. ఈ రాజా లక్ష్మీపతినాయఁడుగారికిని, జింతపల్లి పురాధీశ్వరుఁ డగు శ్రీరాజా వేంకటాద్రినాయఁడుగారికిని బ్రబలకలహములు జరుగ సాగెను. వేంకటాద్రిగారు బసాలత్ జంగుచేఁ దాము గోలుపోయిన ముర్తజనగర్ (కొండవీడు) సర్కారులోనిభాగము నీయ నిర్బంధించెను. లక్ష్మీపతిగారిందుల కియ్యకొనకుండుటచే వేంకటాద్రిగారు ముస్తఫానగర్ (కొండపల్లి) ప్రవేశించి ముక్త్యాల యందుఁ గలకోటను భూమికమట్టముగఁ జేసి 1785 సం॥న సంస్థానమును స్వాధీన మొనరించుకొనిరి. లక్ష్మీపతిగారీ సమాచారమును ఆలోచనసభయం దధిపులుగ నుండిన షడ్డర్ (Mr. Shudder, Acting Chief-in-Council) దొరగారికి విన్నవించుకొనఁగ వారిరువదిమూఁడు గ్రామములతోఁ గూడియున్న చింతలపాడుసంస్థానమునుమాత్రము వీరిస్వాధీన మొనరించిరి.

లక్ష్మీపతిగారి యనంతరము శ్రీరాజా రాఘవయ్యనాయఁడుగారు రాజ్యాధిపత్యమును వహించిరి. వీరు లక్ష్మీపతిగారి సోదరులును రామలింగన్నగారి తృతీయపుత్రులును నై యుండిరి. చింతలపాటివంతింకను గుంటూరునకు సంబంధించి నైజామురాజ్యములోనిదే యయి

యుండెను. అంత వేంకటాద్రినాయుఁడుగారు తిరిగి యవకాశమును జిక్కించుకొని ముక్త్యాల ప్రవేశించి యెదిరించినవారిని వధించుచు శాద్‌షాహిసన్నదులను, మఱికొన్ని ప్రాణతుల్యమైనపట్టాలను దీసికొని పోయిరి. అట్లు ముక్త్యాలగూడ వాని యధీనమేయయ్యెను; గాని వాని నిరోధింపఁగలవా రెవరును లేకపోయిరి. అంత రాఘవయ్యగారు మిగిలినరాజ్యమునే యెనిమిదిసంవత్సరములవఱకుఁ బాలించిరి. తన రాజ్యకాలములో నీయన యనేకతటాకంబులను, నూతులను ద్రవ్వించి గ్రామాదులలోఁ బెక్కురాజమార్గంబుల నేర్పఱచి జనోపయోగంబు లగు మహాకార్యంబుల నెన్నియో యొనరించెను. మఱియుఁ దత్కాలంబునఁ గలిగినకఱవునం దెందఱకో బీదసాదల కన్నోదకంబు లిచ్చి కాపాడెను. ఈ విషయమునుగుఱించి కాంచీమాహాత్మ్యము నందు:—
"కం॥ వాపీకూపతటాకో।ద్దీపితవనరాజి నిలిపి♦ధృతి దుర్భిక్షు।వ్యాపితకాలం బందున।నోపికతో నన్న మొసఁగె♦నుర్విప్రజకున్॥" అనికలదు.

ఈ రాఘవయ్యగారి యనంతరమున వీని యనుజుఁడును రామలింగన్నగారి చతుర్థపుత్రుఁడును నగు చంద్రమౌళిగారు రాజ్యారూఢులైరి. వీరు తమపెద్దలచేఁ బోఁగొట్టుకొనఁబడిన చింతలపాడుసంస్థానములోనిమిగిలినగ్రామములను దిరిగి స్వాధీన మొనరించుకొన నెంచుచుండ నీయుదంతంబును వేంకటాద్రినాయుఁడుగా రాలించి తన పాలనమున నప్రమత్తులై యుండిరి. చంద్రమౌళిగారును దమదుస్థితిని మచిలీపట్టణమునందు కలెక్టరుగ నుండిన జాన్ రీడ్ (Mr. John Reid) దొరగారికి నివేదించిరి. కాని పర్యవసానము దెలియకమునుపే చంద్రమౌళిగారు 1803 వ సం॥లో స్వర్గాభిముఖులైరి.

ఇంతకుమును పనఁగా 1788 వ సం॥ నందు కొండవీడు సర్కారుగూడ నింగ్లీషువారి యధీన మయ్యెను. అంత వారు; వేంకటాద్రినాయఁడు తమయెడఁగృతజ్ఞుఁడై యుండునట్లు బెల్లముకొండ వినుకొండసంస్థానములమీఁది యాధిపత్యము నొసంగిరి.

పిమ్మటఁ జంతపల్లియందు రాజా వేంకటాద్రిగారిచే బంధింపఁ



బడి యున్న పినపెదతండ్రుల కుమారు లగు చంద్రమౌళి, పాపన్న యను నాగన్నగార్లను యథేచ్ఛముగ విడిచిపెట్టుటయేగాక వారికిఁ దగినంత మనువృత్తిగూడ నిచ్చునట్లు చేసిరి. మఱియు వేంకటాద్రినాయుఁడుగారు కొంతకాలమువఱకు గుంటూరునందు నుండ నియమింపఁబడుటచే వారు తమరాజధానిని జంతపల్లినుండి యమరావతికి మార్చుకొనిరి. ఈ యమరావతియందు రాజాగారు హృద్యంబు లగు నుద్యానవనంబులను, సుందరము లగు దేవళంబులను నెలకొల్పిరి. మఱియుఁ బెక్కండ్రు వర్తకుల రప్పించి యందు వసింపఁజేసి విశాలము లగు రాజవీథుల నేర్పఱచి యెంతయో యభివృద్ధికిఁ దెచ్చిరి. ఇంతియేగాక మనోహరం బగు నొకహర్మ్యరాజంబును గూడ నిర్మింపఁజేసి యుపరిభాగమును మెఱుఁగుబెట్టిన రాగిరేకులచేఁ గప్పించిరి. ఈ సౌధమును గట్టునప్పుడు రాళ్ళకై నేలను ద్రవ్వుచుండఁగా బౌద్ధచిహ్నంబు లనేకములు గనుగొనఁబడెను.

1803 వ సంవత్సరము నందు జీవయాత్రను విరమించిన చంద్రమౌళిగారికి చినవేంకటాద్రినాయుఁడుగా రను నొకతనయుఁడు గలఁడు. తమ పూర్వసామ్రాజ్యమును గుఱించి యింతకుఁ బూర్వమే వేఁబడిన వ్యాజ్య మీ చినవేంకటాద్రినాయుఁడుగారి రాజ్యకాలములోఁ బరిష్కరింపఁ బడి ముక్త్యాల చింతలపాడుసంస్థానముల కధీశుఁడుగఁ జేయఁబడెను; కాని యీ సంస్థానాధిపతుల కష్టంబు లింతటితోను నంతరింపక వీరితరువాత రాజ్యపాలకులైన వీరి పుత్రరత్నమనఁ దగు శ్రీ రాజా భవానీముక్తేశ్వరప్రసాదనాయుఁడు బహదరుగారి రాజ్యకాలంబులో నదృశ్యము లయ్యె నని చదువరులు ముందు గ్రహింపఁ గలరు.

చినవేంకటాద్రినాయుఁడుగారికి 'అబ్బయ్య' యను నొక వాడుకపేరుగూడఁ గలదు. ఈయన రాజ్యమునకు వచ్చినప్పుడనే జనోపయోగము లగు సత్కార్యంబుల నెన్నియో చేసెను. కృష్ణానదికి వేదాద్రిచెంత సోపానములను శ్రీ స్వామివారిదేవాలయమునకుఁ బ్రాకారంబునుఁ గట్టించి, నూతనజనపదంబుల నేర్పఱచి ముక్త్యాలకోటను బాగు

చేయించి, పెక్కు కాసారంబులను, కూపంబులను నిర్మింపఁజేసి, జనులను వాత్సల్యముతోఁ జూచుచు మహదైశ్వర్యముతోఁ బ్రజాపాలన మొనరించి దొరతనమువారికిఁ జెల్లింపవలసినకప్పము లెప్పటి వప్పుడే నిశ్శేషంబుగఁ జెల్లింపుచు నుండెను. ఈ రాజాగారి భక్తివైరాగ్యంబులును సత్కార్యవిధానంబులును సక్రిందిపద్య మొకింత సూచింపఁ గలదు.

"సీ॥ పరధరానీకులఁ ♦ బరిమార్చి నిత్యాన్న
దానషోడశమహా♦దానసమితి
నమితభూదానాగ్ర♦హారప్రదానగో
దానాదిధర్మముల్ ♦ దగ ననేక
పర్యాయములు జేసి ♦ భూసురసద్ధర్మ
శాలి యై దేవతా♦సదనములను
గోపురప్రాకార♦కుట్టిమమండప
కలితంబులుగఁ బెక్కు ♦ గతులఁ జేసి
తే॥ గీ॥ ప్రకటకృష్ణాఖ్యనదికి సో♦పానపటలి
నుభయపార్శ్వంబు లందును ♦ నునిచి కీర్తి
సాంద్రచంద్రిక దశదిశా♦సరణిఁ బర్వ
నలరె భూస్థలిఁ జినవేంక♦టాద్రివిభుఁడు॥"

ఇంక శ్రీరాజా వేంకటాద్రినాయఁడుగారిచరిత్రమునకుఁ బోవుదము. శ్రీవేంకటాద్రినాయఁడుగారు తన దానధర్మంబులచేతను, సహజౌదార్యంబుచేతను, జనవశీకరణుం డై గ్రామోద్యోగియు లగుకరణములను దదితరులను లోఁ బఱచుకొని యుండిరి. ఇంతలో ననఁగా 1802 వ సంవత్సరము నందు దొరతనమువారిచే 'శాశ్వతజరాయితీహక్కు' (Permanent Settlement) స్థిరపఱుపఁ బడెను. ఇట్లు స్థిరపఱుపఁబడుటలో శ్రీ భవానీముక్తీశ్వరప్రసాదనాయఁడుగారి సంస్థాన మగు శ్రీచింతలపాడుసంస్థానమునుగూడ దీనితోఁ జేర్చి యొకటిగనే జరాయితీహక్కు నిచ్చిరి. అందువలనఁ జింతలపాటిసంస్థానాధి



పతులు దమ పేష్కష్ (కప్పము)ను దొరతనమువారికిగాక యీ యమరావతీ (వేంకటాద్రినాయఁడుగారినూతనరాజధాని) ప్రభువులకుఁ జేర్ప వీరు తమ పేష్కష్నుగూడఁ గలిపి మొత్తమును దొరతనమువారికి బాపున ట్లయ్యెను. ఇందువలనఁ గలిగినయనర్థకము ముందు తేటపడఁ గలదు.

శ్రీ వేంకటాద్రినాయఁడుగారు తమ దానధర్మాదికార్యంబు లధికంబులుగ నుండినను స్వసామర్థ్యంబుచే ధనాగారంబున నధికధనంబును జేర్పఁ గలిగిరి. రేపల్లిజమీందారు లగు మాణిక్యారావుగారికుటుంబీకులు ఋణగ్రస్తులయి విక్రయించిన వంగిపురమును, మఱియు దొరతనమువారి కప్పమునిమిత్తమై విక్రయింపఁ బడిన కొల్లూరు, నిజాంపట్నములను గొనుటయే గాక వినుకొండజమీలోని గొప్పభాగమును గూడ గుత్తకుఁ దీసికొనిరి. ఇవియేగాక మచిలీపట్టణప్రాంతమందలి యినుగుదుఱు, ఆకులమన్నాడు, ఆఱుదీవులు, కలిదిండి యనువానిని, మేడూరుఘాట్ జమలవాయిపరగణాలలోని కొంతభాగమును గూడ విక్రయమునఁ గొనిరి. ఇట్లు రాజ్యవిస్తారమును సంపాదించి మహోన్నతైశ్వర్యవంతుఁ డై భూలోకదేవేంద్రుఁ డని యనిపించుకొనుటకుఁ గాఁబోలు నమరావతి యను పేరిటి రాజధానియును నందనవనమను పేరు గలయుద్యానవనమును నైరావత మను గజమును గలిగి యుండెను. ఈ శ్రీరాజా వేంకటాద్రినాయఁడుగారు తన యసమానరాజ్యసామ్రాజ్యమున దొరతనమువారి కీయవలసి యున్నకప్పము నత్యంతజాగరూకతతో నిర్ణీతకాలమునకుఁ దప్పకుండఁ నొసంగుచు నుండిరి. ఈ రాజాగారి దిగంతవిశ్రాంతయశస్సును వర్ణింపుచు 1846 సంవత్సరము ఏప్రియల్ 14 వ తేదిని దొరతనమువారికి బంపఁ బడిన రిపోర్టునందు సర్ వాల్టర్ ఇల్లియట్ (Sir. Walter Elliot) దొరగారీదిగువయభిప్రాయము నుదహరించిరి:— "వాసిరెడ్డిసంస్థానాధిపతి యగు వేంకటాద్రినాయఁడు తనకుటుంబసంస్థాన మగు చింతపల్లియెస్టేటునకుఁ దోఁడు రేపల్లిసంస్థానములోనిభాగ మగు వంగిపురమును, కొల్లూరు, నిజాంపట్నములనుగొని కారణాంతరములచే నమరావతిని రాజధానిగ

నేర్పఱచుకొని యచ్చట దివ్యభవనములను శృంగారోద్యానంబులను నిర్మించెను. చేబ్రోలు మున్నగు మఱికొన్ని గ్రామంబు లందుగూడ సౌధరాజంబుల నెలకొల్పెను. మఱియు మంగళగిరియం దత్యున్నతమగు నొక గోపురమును నమరావతి చేబ్రోలు మున్నగుతావులయం దనేక దేవాలయంబులను గట్టించెను. తన రాజ్యమునం బ్రాముఖ్యము లగుపుణ్యస్థలములయందు ముప్పదియడుగుల యెత్తుగలిగి బంగారుమలాము చేయఁబడిన 180యిత్తడిస్తంభముల స్థాపించెను. ఇంతియేగాక రెండుసారులురజితముతోను, నొకసారి సువర్ణముతోను తులాభారముం దూఁగి బ్రాహ్మణులకు బంచి పెట్టెను. రామేశ్వరము మొదలుగాఁ గల దివ్యక్షేత్రములకుఁ బోయి పెక్కుయాత్రలను సేవించి కాశికి బోవునపుడు పేష్వా బాజీరావుగారి కమూల్యము లగుకానుక లనేకముల నర్పించెను. తన పేష్కషను ముందుగనే చెల్లించి తన నూర్గఱవ్యయములకుఁగాను రెండులక్షలరూపాయలను దొరతనమువారిధనాగారమునందు నిలువయుంచెను. బాదిపోటుగాండ్ర నుక్కడఁచినందున నైజాము నుండి 'మన్నేసుల్తాన్' అనుబిరుదమును బడసి కానుకగా లక్షపెగోడాలు (నాలుగులక్షల రూపాయలు) నైజామున కర్పించెను.

వీరినిగుఱించి కాంచీమాహాత్మ్యమునం దిట్లు వర్ణింపఁబడినది-

"సీ. సేతు కాశీ మధ్య♦సీమాంతరస్థిత
గురుతరశ్రీరంగ ♦ కుంభకోణ
పాశనాశక జంబు♦కేశ చిదంబర
కాంచీమహాపురీ ♦ కాళహస్తి
శేషావనీధర ♦ శ్రీగిరి శ్రీజగ
న్నాథాది దేవతా♦స్థలుల కరిగి
యచ్చోటఁ దనపేర ♦ హరిహరమూర్తుల
నిలిపి మూఁదట హేమ♦నిర్మితంబు
తే. గీ. లైన కీర్తిధ్వజంబుల ♦ నచ్ఛితముగ
స్థాపనముఁ జేసి తనకీర్తి ♦ దశదిశాన



స్థానముల నెల్ల నిండించె ♦ వాసిరెడ్డి
వేంకటాద్రీంద్రుఁ డసదృశ♦విభవుఁ డగుచు.

క. తగమత్స్యపురాణోదిత
మగు నట్టి హిరణ్యగర్భ♦మును సద్వరముల్
మిగులఁగ ధర్మతనూజుని
యగణితసద్రాజసూయ ♦ మట్లుగఁ జేసెన్."

ఈ రాజా వేంకటాద్రినాయఁడుగారు సంతానహీను లగుటచే, 1794 వ సంవత్సరములో బంధవిముక్తు లైన చంద్రమౌళిగారియొక్కయు, నాగన్న యనెడి పాపయ్యగారియొక్కయు జగన్నాథబాబు రామనాథబాబు అను కుమారుల నిద్దరను బెంచుకొనిరి. జగన్నాథబాబుగారు చంద్రమౌళిగారికి 1797 వ సం॥ లో జన్మించిన ద్వితీయకుమారులు. వీరు 1798 వ సం॥లో దత్తస్వీకారు లైరి. అటులనే 1806 వ సం॥లో జన్మించిన నాగన్న యనెడి పాపయ్యగారిద్వితీయపుత్రులగు రామనాథబాబుగారుకూడ 1807 సం॥లో దత్తపుత్రులయిరి.

అంత 1815 వ సంవత్సరమునందు జ్యేష్ఠపుత్రుఁ డగుజగన్నాథబాబు యుక్తవయస్కుఁ డగుటచే శ్రీరాజా వేంకటాద్రినాయఁడుగారు తన యపారరాజ్యసామ్రాజ్యమును విభజించి 314 గ్రామములు చేరిన యొకభాగమును జగన్నాథబాబుగారికిని 237 గ్రామములు చేరిన చేబ్రోలుభాగమును రామనాథబాబుగారికిని 1816 వ సం॥ ఫిబ్రవరి జులై నెలలలోఁ బంచి యిచ్చి 1816 ఆగష్టునెల 17 వ తేదిని బరలోకప్రాప్తు లైరి.

అటుపిమ్మట దత్తపుత్రు లగుసోదరుల కిరువురకును సంస్థానాధిపత్యములను గుఱించి ప్రబలకలహములు ప్రారంభ మయ్యెను. సమయముదొరికెఁ గదా యని యుభయపక్షముల యందును సలహాదారులు గుమిగూడిరి. సబ్నవీసు అనంతన్నపంతులనువాఁడు జగన్నాథబాబుపక్షము జేరెను. పొత్తూరి కాళిదాసు రామనాథబాబు పక్షము జేరెను. అంతజగన్నాథబాబు ద్వితీయదత్తస్వీకార మశా

స్త్రీయ ననియు, సంస్థానమంతకును దానే యధిపతియనియు దావా తెచ్చెను. రామనాథబాబుగారు వేంకటాద్రినాయఁడుగారిచే జగన్నాథబాబువలెఁ దానును దత్తస్వీకారు డయినట్లును, చేబ్రోలుభాగము వేంకటాద్రినాయఁడుగారివల్లనే తనకు నిరూపింపఁ బడిన దనియుఁ బ్రతివాదింపఁ దొడఁగిరి. ఇట్లుభయులకును వ్యాజ్యకారణములు గన్పించుచుండెను. ఇంతలోఁ గృష్ణాగుంటూరుమండలము లందలి కలెక్టరు లీసంస్థానముపై దొరతనమువారికి రావలసినకప్పములు దిగఁబడుటచే విశేషభాగమును స్వాధీనపఱచుకొనిరి. పూర్వోక్తకారణంబుల చేసి యమరావతీసంస్థానసామ్రాజ్యలక్ష్మి చంచలభావ మంద సాగెను.

వ్యాజ్యము లటులనే నచ్చుచుండెను. గృహకల్లోలములు ప్రబలసాగెను. 1824 జూన్ 16 వ తేదిని జగన్నాథబాబుపక్షమున ప్రొవిన్షల్ కోర్టువారు తీర్పు చెప్పిరి. అంత రామనాథబాబుగారు చెన్నపురిలో సాదరు కోర్టున కప్పీలు చేసిరి. ఇదియిట్లుండఁగా 1825 సం॥ ఫిబ్రవరి 28 వ తేదిని జగన్నాథబాబుగారు స్వర్గస్థులగుటచే సంస్థానమున కంతకును దానే వారసుఁడనని రామనాథబాబు దావా తెచ్చెను. ఈ దావాకూడ ప్రొవిన్షల్ కోర్టువారిచే 1825 సం॥ డిశంబరు 22 వ తేదిని జగన్నాథబాబుగారి ప్రథమభార్య యగు అచ్చమ్మగారిపక్షమునఁ దీర్పుఁ జెప్పఁ బడెను. జగన్నాథబాబుగారి కీయచ్చమ్మగారుగాక రంగమ్మగారను మఱియొకభార్యగలదు. ఈపెవలనఁ బెంచుకొనఁబడిన లక్ష్మీపతి యనునొక కుమారుఁడును గలఁడు.

ప్రొవిన్షల్ కోర్టువారితీర్పు మీఁద రామనాథబాబు తిరిగి సాదరుకోర్టువారి కప్పీలు చేసి యుండుటచే నిప్పటికి రామనాథబాబుగారి యప్పీళ్ళు రెండును విచారణలో నుండెను. అంతట రంగమ్మగారు,తన భర్తజీవితములోనె పెంచుకొనఁబడిన లక్ష్మీపతి యనునొకపుత్రుఁడును గలఁడనియు వేంకటాద్రినాయఁడుగారి సర్వస్వమున కీయనవారసుఁడనియు 1826 సెప్టెంబరు 6 వ తేదీని దనమఱిదిగా రగు రామనాథబాబుగారిమీఁదను అచ్చమ్మగారిమీఁదను దావా తెచ్చిరి కాని ప్రొవిన్షల్ కోర్టువారిపెసాక్ష్యమును విచారించుటకు సైత మనంగీకారులై



వ్యాజ్యమును గ్రోసివేసిరి. అంతట రంగమ్మగారు మదరాసులోని సాదరు కోర్టునకు 1829 అక్టోబరు 22 వ తేదీని అప్పీలు చేసికొనఁగా వారు సాక్ష్యమును విచారింపవలసిన దని తిరిగి ప్రొవిన్షల్ కోర్టువారి కాజ్ఞాపించిరి. ఈదావాలో లక్ష్మీపతిగారి దత్తతవిషయమై మచిలీపట్నముకలెక్టరుగారగు రాబర్ట్సు (Mr. Roberts) దొరగారి సన్నిధికి జగన్నాథబాబుగారు బాలుఁడుగా నుండిన లక్ష్మీపతిగారితోఁ గూడ నేఁగి యాబాలుఁడు తనదత్తపుత్రుఁడుగా నెంచుకొనినట్లును నాసంగతిని రాబర్ట్సుదొరగారు రెవిన్యూబోర్డువారికి రిపోర్టు చేసి యుండినట్లును జెప్పఁబడు సంశములు ప్రబలాధారము లగు యుండెను; గాని కృష్ణాగుంటూరుమండలముల కలెక్టరు లగు రుసెల్, ఓక్సు, విష్ (Russell, Oakes and Whish) దొరగార్లీవిషయమై యెఱుఁగ రఁట.

1830 జులై 5 వ తేదీని లక్ష్మీపతిగారిదత్తతకుఁ బ్రతికూలముగ నొకవిస్తీర్ణమైనతీర్మానమును జేసిరి. అంత రంగమ్మగారు మదరాసులోని సాదరుకోర్టున కప్పీలు చేసికొనిరి. సాదరుకోర్టువారుకూడ 1832 మార్చి 14 తేదిని జగన్నాథబాబుగారిచే లక్ష్మీపతినాయఁడుగారు దత్తస్వీకారులు కాఁబడలే దనియు, ద్వితీయపుత్రుఁ డగు రామనాథబాబుగారు వేంకటాద్రినాయఁడుగారిచే నిశ్చయముగాఁ బెంపు చేసికొనఁబడిరనియు, సోదరు లగు జగన్నాథబాబు రామనాథబాబు లిరువురు నవిభక్తులనియుఁ, గావున భర్తృవియోగప్రభృతి వారికళత్రములయినయచ్చమ్మ రంగమ్మగార్లు మనువృత్తికిమాత్రమే యర్హులనియుఁ దీర్మానించిరి. ఈతీర్మానముచే రామనాథబాబుగారు వేంకటాద్రినాయఁడుగారిచే విడువఁబడిన సంస్థానమున కెల్ల నధినాథుఁడయ్యెను, గాని యప్పటికే దొరతనమువారికి చెల్లింపవలసిన పేష్కష్ చాల దిగబడియుండెను. సంస్థానపు టుద్యోగస్థు లెల్లరు ధనాపహర్తలైరి. ఈ విషయమును గుఱించి గుంటూరు డిప్యూటితహశీల్దా రగు చిరుమామిళ్ల లక్ష్మీనారాయణప్రసాద్ బి. ఏ. గా రాంధ్రపత్రికయొక్క 1912 వ సంవత్సరపు సంవత్సరాది సంచికయం దిట్లు వ్రాసిరి:—" కేవల స్వోదరపోషణార్థమై పయోముఖవిషకుంభముల వలె నక్కవినయములతోఁ గొలువు

నర్పుచుండిన దివానులయొక్కయు గుమాస్తాలయొక్కయు గృహములయందు ధనరాసులు నిండ దయ్యెను. సంస్థానపు నౌకర్లు స్వామిద్రోహులై మోసగించి సంస్థానపుధనముతోఁ దమపేరను, దమభార్యలపేరను బెక్కు బినాములను బంటభూములను సంపాదించిరి. ఇంటియందు వంటజేసి తద్దినములను బెట్టించెడి పౌరోహితులుసయితము సమయము వేచి వెండిబంగారులను హరించి లక్షాధికారులయిరి. ఇన్ని కారణములనుబట్టియు 1844 వ సంవత్సరమువచ్చుసరికి నవరత్నరాసులతో నిండియుండిన సంస్థానపుబొక్కసమున పైసాకూడ కఱవయ్యెను”.

గోరుచుట్టుపై రోకటిపోటనునట్లు 1832 వ సంవత్సరమునందు దారుణమైన క్షామబాధయుఁ దటస్థమయ్యెను. అందుచే రైతులు కడుంగడు క్షీణించిరి. వితంతువు లిరువురును సామ్రాజ్యమునకై శ్రీచక్రవర్తిగారికి దిరిగి అప్పీలు చేసికొని యుండుటచే సంస్థానాధిపతి గాఁబడిన రామనాథబాబుగారు దొరతనమువారిపక్షమునఁ గొంతకాలమువఱకు సంస్థానమున కంతకు నధ్యక్షుఁడు (Manager) గ నుంపఁబడెను. అయినను వీరి కార్యనిర్వాహకత్వ మంత జయప్రదముగ నుండకపోయెను. వీరు 1842 వ సంవత్సరములో, దొరతనమువారివలన ఋణములు తీరిన పిమ్మట సంస్థానమును దిరిగి యిచ్చివేయునట్లును, ఈమధ్యకాలములో సొంతగాసిక వేయిరూపాయల మనువృత్తి నిచ్చునట్లును లిఖితపూర్వకమగు వాగ్దానమును స్వీకరించి సంస్థానమును దొరతనమువారి కిచ్చివేసిరి. ఈ నిర్ధారణము కోర్టు ఆఫ్ డైరక్టర్సువారి 1842 జూన్ 21 వ తేది 14 నంబరుగల లేఖననుసరించి యుండెనుగాని మఱి యేవిధముననైనను ఋణములు దీరుటసంభవమని గ్రహించి దొరతనమువారు విధాయకప్రకారము 1846 వ సం॥ సంధావిక్రయింప నిశ్చయించి జమీని స్వాధీనమొనరించుకొని నదిమొదలప్పటినుండి కిచ్చుచు వచ్చినరు 1000 ల మనువృత్తిమాత్రమె స్థిరపఱచి దొరతనమువారే సంస్థానమునుగూర్చి శాశ్వతాధికారులైరి.

ఇంతలో జగన్నాథబాబుగారి కళత్రము లిరువురును ప్రీవీకౌ



న్సిలులోఁ దెచ్చినయప్పీలు విచారణలోనికి వచ్చి 1848 సం॥ ఫిబ్రవరి 29 వ తేదిని ద్వితీయసోదరుఁడగు రామనాథబాబుగారిదత్తత శాస్త్రానుగుణ్యముకాదనియు నాయన రాజా వేంకటాద్రినాయఁడుగారిపూర్వార్జితమైనసొత్తునకేవిధమునను హక్కుదారుఁడు గాఁ జాలఁడనియు, నాసామ్రాజ్యమంతయు జగన్నాథబాబుగారికే చెందవలసిన దనియు, వేంకటాద్రినాయఁడుగారి స్వార్జితమై యొసంగఁబడిన దేదియైనఁ గలదేని దానికే యధికారియగు ననియు, మఱియుఁ దమకుయుక్తమని తోఁచినరీతిని దీర్పుచెప్పు దేశీయసభల (Native Courts) ననుసరించు సివిల్ యుద్యోగీయులవలెఁ గాక యీకోర్టువారు సాక్ష్యవిమర్శనమువల్లనే తీర్మానించువారగుటచే జగన్నాథబాబుగారిచేఁ బెంచుకొనఁబడిన లక్ష్మీపతిగారిదత్తత యుక్తమైనదే యనియుఁ దీర్మానించి, దానిని మదరాసులోని హైకోర్టువారికి తీర్మానముప్రకారము జరిగింపఁ బంపిరి.

అంత లక్ష్మీపతినాయఁడుగారు సంస్థానమును స్వాధీనమొనరింప దొరతనమువారికి విన్నవించుకొనిరి; కాని సంస్థానమిదివఱకే విక్రయింపఁబడి తత్సామ్రాజ్యముగా దొరతనమువారిచే నంగీకరింపఁబడి రామనాథబాబుగారి కొసఁగఁబడుచున్న వేయిరూపాయల మనువృత్తిమాత్రము మిగిలి యుండెను. లక్ష్మీపతినాయఁడుగారు తిరిగి యప్పీలుచేసికొనిరిగాని యీ సహస్రరూప్యముల మనువృత్తిమాత్రమె మిగిలి యుండుటచే లక్ష్మీపతినాయఁడుగారా మనువృత్తిమాత్రమె స్వీకరింపవలసినవారైరి. వీరియనంతరమున వీరిభార్యాగారగు వాసిరెడ్డి వేంకటలక్ష్మమ్మగారికీ వేయిరూపాయలమనువృత్తియుఁ దొలంగింపఁబడి 750 రూపాయల మనువృత్తిమాత్ర మాపెజీవితమువఱకు దయఁదలంచి యిచ్చునట్లును బదంపడి యాపెకుమారులగు శ్రీరాజా వాసిరెడ్డి వేంకటలక్ష్మీనరసింహమునాయఁడుబహదరుగారు దత్తపుత్రులను మిషచేసి మనువృత్తికూడ నంతరించునట్లును బరిణమించెను; గాని వేంకటలక్ష్మమ్మగారెంతయో శ్రమజేసి యొనర్చిన విశ్వప్రయత్నము వలన వారికేగాక వారివంశపారంపర్యముగ మొదటి వేయిరూపా

యల మనువృత్తియే స్థిరపఱుపఁబడెను.

ఈ శ్రీరాజా వాసిరెడ్డి వేంకటలక్ష్మీనరసింహమునాయఁడు బహాదరు మన్నె సుల్తాన్‌గారు కంచిమైన రను వాడుకనామము గలిగి సుప్రసిద్ధులై యుండిరి. వీరి దానశీలత్వమును గుఱించి గుంటూరు డిప్యూటితహశీలుదారు మ॥రా॥శ్రీ చిరుమామిళ్ల నారాయణప్రసాద్ బి. ఏ. గారిట్లు వ్రాసిరి.—"వీరి దాతృతాస్వభావమును ధైర్యగాంభీర్యాదిగుణములును లోకవిదితంబులు గావున వేఱుగ వక్కాణింపఁ బని లేదు." వీరియనంతరమునఁ జింతపల్లి దొరసానిగారను శ్రీరాజా వాసిరెడ్డి వేంకటలక్ష్మీనరసమ్మ బహాదరు మన్నె సుల్తాన్‌గారిప్పుడు గుంటూరునందు నివసించుచుఁ దమకు వచ్చుమనువృత్తి వేయిరూపాయలే యైనను నవరాత్రము లందును దదితరసందర్భము లందును నా సత్వమాతల్లి యొనర్చు ధర్మకార్యము లత్యంతశ్లాఘనీయములై యుండెను.

ఇచ్చట మఱియొక విషయమునకై యించుక సింహావలోకన మొనరింపవలసి యున్నది. వాసిరెడ్డి రామనాథబాబుగారు 1859 సం॥లో గతించిరి. వీరి మున్నూఱు రూప్యముల మనువృత్తి కొంత కాలమువఱకు మాత్ర మందులో సగము వీరిభార్యగారికి వచ్చుచుండెనుగాని పిమ్మట దాశరథనాయఁడు శివప్రసాదనాయఁడు ననువీరిపుత్రుల కిరువురకును మొదటి 300 ల మనువృత్తియే వచ్చుచుండెను.

రామనాథబాబుగారితండ్రిగారగు నాగన్న యనెడిపాపయ్యగారికిని జగన్నాథబాబుగారితండ్రిగారగు చంద్రమౌళిగారికిని దొరతనమువారిప్రేరేపణచే శ్రీరాజా వేంకటాద్రినాయఁడుగారు రూ 385 ల మనువృత్తి నిచ్చుచుండిరి. కాని వారియనంతరమున నీమనువృత్తిని గుంటూరుమండలపు కలెక్టరుగారిచ్చుచు వచ్చిరి. పాపయ్యగారియనంతరమున వారిపుత్రుఁడును రామనాథబాబుగారియగ్రజుఁడును నగు రామన్నగారి కొసఁగఁ బడుచుండెను. ఈయన యపుత్రకుఁ డగుటచే వీరిమనువృత్తి వీరితోనే యంతరించి పోయెను. ఇఁకఁ జంద్రమౌళి



గారి రు 385 ల మనువృత్తి వారిపుత్రుఁ డగు పద్మనాభరామన్నగారికిని బిమ్మటఁ బౌత్రుఁ డగు నాయుడమ్మగారికిని నటుపిమ్మటఁ బ్రపౌత్రులగు పద్మనాభరామన్న చంద్రమౌళిగార్లకును వచ్చుచుండెను.

ఇఁక మనప్రస్తుతకథాస్థానంబగు, వాసిరెడ్డిసామ్రాజ్యవిభాసితంబును నగు చింతలపాటిసంస్థానచారిత్రంబును వర్ణించెదము. ఈ సంస్థానమునకుఁ జిన వేంకటాద్రినాయఁడుగారియనంతరమున శ్రీరాజా భవానీముక్తీశ్వరప్రసాదనాయఁడు బహాదరుగారు రాజ్యాధిపతులైరి. వీరు తమరాజ్యకాలములోఁ దమసోదరులగు చంద్రమౌళిప్రసాద్‌గారికిని, సదాశివప్రసాద్‌గారికిని మనువృత్తి నిచ్చుచుఁ బాలింపఁ జొచ్చిరి. వీరి బాల్యమునందు సుఖోపవిష్టంబున కవకాశము లేనిసందర్భ మయ్యును వీరి జనని సంరక్షకురాలుగ నుండి రాజ్యభారమును వహింపవలసినదయ్యెను. ఈమె తనకార్యక్రమంబు నెట్టిసామర్థ్యంబుతో నిర్వహించుచుండినను నీమెకడఁ గలయుద్యోగియులచేఁ గొనిరాఁబడిన వ్యాజ్యములవలన నెక్కుడు ఋణగ్రస్తురాలు గావలసివచ్చెను. ఈ శ్రమలతోఁ గూడ దేశంబునందు 1832-33 సంవత్సరములయందు దుర్భరమగు క్షామబాధయుఁ దటస్థించెను. పూర్వోక్తకారణంబులచే రాజ్య మత్యంతక్షైణ్యదశకు రాఁ జొచ్చెను; గాని పాప మామె తన యాస్తిని విక్రయించియైనను దొరతనమువారికిఁ జెల్లింపవలసినకప్పమును నెప్పటి దప్పుడ తప్పక చెల్లించుచు వచ్చుచుండెను. అయిన నొకప్పుడు మాత్ర మట్లు చెల్లించుట కొకింతకాలహరణ మగుటచే సంస్థానము దొరతనమువారిస్వాధీనములోనికి బోయెను. ఈ యనర్థకంబునకు మిక్కిలి చింతాక్రాంతురాలయి యామె తనజమీవిడుదలకొఱకుఁ బెక్కుసారులు కలెక్టరుగారికి విన్నవించుకొనెను, గాని ప్రయోజనము లేకపోయెను.

ఇంతకుమున్ను వాసిరెడ్డిసంస్థానముమీఁద ననఁగాఁ జింతపల్లి సంస్థానముమీఁదఁ దత్కాలమునకుమాత్రము దొరతనమువారిచే నాధిపత్య మొసఁగఁబడిన రామనాథబాబుగారికీచింతలపాటిసంస్థానాధికారముగూడఁ బొరపాటున నొప్పగింపఁబడి పిమ్మట నాయనపై నీయధి

కారంబు శాశ్వతముగ నిల్చి పోయెను. పిమ్మట శ్రీభవానీముక్తీశ్వరప్రసాదనాయఁడుగారు పాలనార్హవయస్కులై రాజ్యమునకు వచ్చిరిగాని తమహస్తగతంబగుసంస్థానమించుకేనియు లేకుండు టెఱింగి తను యుదంతంబు నెల్ల నప్పటికలెక్టరగు బ్లెన్‌గ్రాంటు (Mr. Blengrant) దొరగారికివిన్నవించుకొనిరి. దయాళువులగు శ్రీకలెక్టరుగారు తత్క్షణమే యీ విషయమును బోర్డువారికి విశదీకరించి వారి యాజ్ఞచే సంస్థానమును మన భవానీముక్తీశ్వరప్రసాదనాయఁడుగారికి తిరిగి యొప్పగించిరి. వీరు తమసామ్రాజ్యాభివృద్ధి కయి మిక్కిలి శ్రమచేసి నైజాము రాజ్యమునుండి పెక్కండ్రు రైతులను గొనివచ్చి వారికి భూవసతిని గల్పించి తనరైతులుగఁ జేసికొనిరి. ఇంతలోఁ దిరిగి మఱియొకయనర్థకంబు వాటిల్లెను. నందిగామ (చింతపల్లి) సంస్థానాధిపతులు చెల్లింపవలసిన కప్పములు చాలవఱకు దిగబడి సంస్థానము విక్రయస్థితికి వచ్చినప్పుడు దొరతనమువారీసంస్థానముతోఁబాటు చింతలపాడు సంస్థానమునుగూడ స్వాధీన మొనరించుకొనిరి. ఇది యక్రమమే యైనను నిందులకుఁ గారణము లేకపోలేదు. చింతపల్లిసంస్థానాధిపతు లగు శ్రీరాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయఁడుగారికి 1802 వ సంవత్సరములోఁ దత్సంస్థానముపై శాశ్వతజిరాయితీహక్కు నిచ్చునప్పుడీ చింతలపాటి సంస్థానము ప్రత్యేకసంస్థాన మని భావింపక యంతయు నొకటిగనే యెంచి పొఱబాటున నొసఁగఁబడిన పట్టావలన, 1846-48 సంవత్సరములలో పేష్కష్ చెల్లింపఁబడక నిలచియుండుటవలనఁ జింతపల్లిసంస్థానమును విక్రయములోఁ దీసికొనుచు మనచింతలపాటిసంస్థానమునుగూడ లాగుకొనిరి. కప్పముల దిగబాటుల (arrears) వలన నీరెండు సంస్థానములును దొరతనమువారి హస్తగత మయి పిమ్మట చింతపల్లిసంస్థానముయొక్క ఋణాధిక్యతవలన నిట్లు పరాక్రాంత మయ్యెను.

కావున శ్రీభవానీముక్తీశ్వరప్రసాదనాయఁడుగారు తమ సంస్థానపునస్స్వీకారమునకై యెంతయో శ్రమ పడవలసివచ్చెను. శ్రీవారమితభక్తిపరాధీను లగుటచేఁ దమసామ్రాజ్యము దైవసాహాయ్యముండినఁగాని క్రమ్మఱ లభింపఁజాలదని నిశ్చయించి కాంచీత్యాది దివ్య



క్షేత్రముల సందర్శించి కేవలభగవదనుగ్రహంబునలనఁ బునరైశ్వర్యంబు నొందిన ట్లీదిగువపద్యముల యందుఁ జెప్పంబడియె:—

"సీ॥ పూర్వరాజ్యము పఠాణ♦భూపాలవశ మౌట
బునరుద్ధరణబుద్ధి ♦ వొడమి మిగుల
బహుయత్నములు జేసి ♦ పడయఁ జాలక యన్య
శరణుఁ డైశంకరు ♦ శరణ మంద
సర్వేష్టసిద్ధులు ♦ సమకూఱు నని యెంచి
శివనివాసపురివి♦శేష మైన
కాంచికాపురికి నే♦కామ్రనాథుని గొల్వ
జన నిశ్చయించి యా ♦ జనవిభుండు

తే॥ గీ॥ తనకు నగ్రకుమారుఁ డై ♦ తనరు నట్టి
యిష్టసద్వర్తనుఁడుమామ♦హేశ్వరప్ర
సాదనాయనితోఁ గూడి ♦ యాదరమున
ముక్తిలింగంబు సేవించి ♦ ముదము గదుర॥

శా॥ ఆ ముక్తీలపురీస్థలిన్ వెడలి వే♦దాద్రీంద్రదివ్యస్థలం
బామోదంబునఁ జేరి యందు నరసిం♦హస్వామిసేవించి కృ
ష్ణామేయాపగ దాటుమార్గమున దే♦వావాసమున్ జూచుచున్
శ్రీమన్నిర్మలకోటిలింగమును మున్ ♦ సేవించి యామీఁదటన్॥

* * * *

తే॥ గీ॥ అచట నేకామ్రమూల మం ♦ దలరు చున్న
దివ్యతేజస్స్వరూపుని ♦ దేవదేవు
బోధమయుఁ డగు నేకామ్ర♦నాథుఁ గాంచి
యే డహోరాత్రములు నిల్చి ♦ యేకనిష్ఠ
నచటఁ బద్మాసనస్థుఁ డై ♦ యంగకముల
భసిత ముద్ధూళనము జేసి ♦ ఫాల మందు
మూఁడు రేఖలుగాఁగఁ ద్రి♦పుండ్ర మునిచి
చారురుద్రాక్షమాలికా♦ధారుఁ డగుచు॥"

ఇట్లు పరమేశ్వరుని తదేకనిష్ఠాగరిష్ఠుండై యారాధించు నంత భక్తవత్సలుం డగుభగవంతుండు—

"మ॥ పొడచూపెన్ శతకోటిభాస్కరకర♦స్ఫూర్జత్ప్రభాశాలియై
యుడురాడర్ధకిరీటుండై సురనదీ♦యుంజజ్జటాజూటుండై
కడిమిన్ బన్నగభూషణుం డలు శుభా♦కారుండు నై దిక్కులన్
గడువేడ్కన్ బ్రమథాళి గొల్వ నట నే♦కామ్రేశుఁ డంచత్కృపన్॥

తే॥ గీ॥ అట్లు దృశ్యత్వ మొంది యే♦కామ్రనాథుఁ
డీవు కోరినకోరిక ♦ లిపుడ యగును
జెన్నపురి కేఁగు మని చెప్పి ♦ చిన్మయాంబ
రమునఁ గలిసెను శార్వరీ♦రమణుఁ డపుడు॥"

అంతఁ జెన్నపురికి వచ్చి రాజకీయవ్యవహారంబులం జరిపి పదంపడి—

"తే॥గీ॥ పూర్వరాజ్యంబు బడసి తా ♦ ముండు నటులఁ
బుత్రపౌత్రపరంపరా♦పురుషతతికి
రాజ్యహాని యొకింతయు ♦ రాక యుండఁ
గా, నపుడు శాశ్వతం బగు♦కౌలు వడసె॥

క॥ తనపూర్వనృపులకంటెన్
ఘనసామర్థ్యమున నిట్లు ♦ కష్టించి ధరన్
బునరుద్ధరణం బొనరిచి
తనయునితో మరలి వచ్చెఁ ♦ దనపురమునకున్॥"

ఇట్లు కంచి యేకామ్రేశ్వరుని కారుణికంబుననే తమ పూర్వవైభవము సంప్రాప్తమైన దని శ్రీరాజాగారు తమయంకితమున 'శ్రీకాంచీమాహాత్మ్య' మును రచింపఁజేసి రని యీక్రిందిపద్యము నుడువుచున్నది—

"తే॥గీ॥ కాంచియేకామ్రనాథుని ♦ కరుణచేత
మాకుఁ గ్రమ్మఱ సామ్రాజ్య♦మహిమ గలిగె
నందుచేఁ గాంచిమాహాత్మ్య ♦ మాంధ్రభాష
కృతిని జేయించుబుద్ధి మా ♦ కిపుడు బొడమె॥"



శ్రీ భవానీముక్తీశ్వరప్రసాదనాయఁడుగారు కాంచీమాహాత్మ్యము నేగాక 'ద్రౌపదీవస్త్రాపహరణము'ను గూడ సంస్కృతమునుండి తెనిగింపఁ జేసి తాము కృతిపతులై యుండిరి.

బ్రిటిష్ దొరతనమువారు 'మన్నెసుల్తాన్' అనుబిరుదమును వంశపారంపర్యముగ వచ్చునట్లొసంగిరి. మఱియు నైజాము దొరతనమువారు "రాజబహద్దరు, షహామత్ మర్తబత్ వ అలి మన్జిలత్, సల్లమహూ అల్లాహుతల్లా" అనుబిరుదులను వారి కుటుంబమున కొసంగిరి.

శ్రీరాజా ముక్తీశ్వరప్రసాదనాయఁడుబహదరుగారికి యుమామహేశ్వరప్రసాదనాయఁడుగారు, వేంకటాద్రినాయఁడుగారు నను నిరువురుపుత్రులుగలరు. తన యనంతర మీయిరువురుపుత్రులును దమలోఁ దాము కలహింపకుండు నట్లు శ్రీరాజాగారు పుత్రులయనుమతిచేతనే చరాస్తి నంతయు నిరువురకుఁ బంచిపెట్టి చిన్నకుమారుఁడగు వేంకటాద్రినాయఁడుగారికి వారిమనువృత్తినిమిత్తమై రెండుగ్రామంబుల నొసంగి వారిని సంతోషపఱచెను. ఈ రెండుగ్రామంబులపై వచ్చునాదాయ మా వేంకటాద్రినాయఁడుగారి వ్యయంబునకుఁ జాలిన దై యుండెను. మఱియు వారి నివాసార్థ మొకదివ్యభవనంబుగూడ నిర్మించి యొసంగెను. ఈవిధముగా శ్రీరాజాగా రంతఃకలహంబులు జనింపకుండునట్లు తమ బుద్ధివైశద్యముచే నన్నియుఁ జక్కఁజేసి యంతటితో నూరకుండక తమ వార్ధికదశయందు తన రాజ్యభారమునుగూడఁ దొలగించుకొనఁ గోరెను. కావున శ్రీ భవానీముక్తీశ్వర ప్రసాదనాయఁడు బహదరుగారు శ్రీకృష్ణాకలెక్టరుగారికి 1887 వ సంవత్సరము జూలై నెల 12 వ తేదీయందు, "నేను వృద్ధవయస్కుఁడ నగుచున్నాఁడను గావున నాపెద్దకుమారుఁడు తక్షణమే నాస్థానంబున బ్రవేశించి నాజమీనాయొక్క పాలనాధికారంబును వహింపవలె నని కోరుచున్నాను; గనుక జమీని వానిపేర రిజిష్టరుచేయవలయు నని విన్నవించుకొను చున్నాఁడను" అను నభిప్రాయంబుగల యర్జీ నిచ్చుకొనఁగ శ్రీ కలెక్టరుగారు 1887 వ సంవత్సరము నవంబరు 26 వ తేదీయందు

శ్రీ యుమామహేశ్వరప్రసాదనాయఁడుగారికి "ఎస్టేటు మీతండ్రిగారి కోరికప్రకారము మీపేర మార్పఁబడినది. నేఁటినుండి మీరు పేష్కష్‌ను మామూలుప్రకారము చెల్లింపుచుండవలెను" అని యాజ్ఞాపించిరి. ఇట్లు భవానీముక్తీశ్వరప్రసాదనాయఁడుగారు తమ జీవితమధ్యంబుననే యెస్టేటును దమ తనయునిపేర రిజష్టరు చేయించిరి. మఱియు నీ ముక్తీశ్వరప్రసాదనాయఁడుగారి రాజ్యారంభకాలముననే వ్యాపించిన దారుణమైనక్షామంబువలనఁ బెక్కండ్రు రైతులు భూములను సేద్య మొనరించుకొనలేక విడిచిపెట్టుటచేఁ బెక్కుభూములు పాడుపడియుండుటను జూచి చెంతఁ గల బ్రిటిష్‌నైజాములలోని పెక్కండ్రు రైతులను గొనివచ్చి వారికి స్వల్పమైన శిస్తుమీఁద భూముల నొసంగి వెంటవెంటనే విడుదలకై కోళ్ళొనరించుకొనుట కనువగుపద్ధతిమీఁదఁ బట్టాల నిచ్చివేసిరి. దీనివలన రైతులును, భూస్వామియుఁ గ్రమక్రమాభివృద్ధి నొంద నవకాశము గల్గెను. మఱియు వీరు 1283 వ ఫసలీయందైదేండ్ల కొకసారి పట్టాలను ముచ్చిలికాలను మార్చుపద్ధతి నేర్పఱచి ప్రతిపర్యాయమును శిస్తు నభివృద్ధిసేయుచు రైతులకు భారము లేకుండ నభివృద్ధికి తేఁ గలిగిరి. ఈ శ్రీరాజా ముక్తీశ్వరప్రసాదనాయఁడుగారు పాడుబడి యున్న మునియేరుయొక్క కాలువలను సేద్యానుకూలమగునట్లు జక్కగ బాగుజేయించి నందిగామతాలూకాలో గొప్ప భూభాగమును సస్యవంత మగుదానినిగఁ జేసిరి. వీరిజమీలో నుండి పాఱుచున్న యీమునియేటినీటిని దొరతనమువారుగూడ వాడుకొను చుండుటచే గవర్నమెంటువారే మనజమీందారుగారికి నీటితీరువ నీయవలసినవారైరి. ఈ యేటినీటివలన విశేషభూభాగము సాగగుచుండుటచే దేశ మెక్కుడభ్యున్నతస్థితికి రాఁ గలిగెను. చింతలపాటిలోని తటాకములును మిగుల సంస్కరింపఁబడుటచేతఁ గూడ మంచిరాబడి రాఁ గలిగెను.

శ్రీరాజాగారి పరిపాలనకాలంబున సంప్రాప్తమైన 'మహోదయ' పుణ్యావసరంబున శాస్త్రీయపద్ధతిని ధర్మకార్యంబు లెన్నియో యొనరించిరి. పుష్పగిరిమఠమునందలి చంద్రమౌళీశ్వరస్వామికి చింతలపాడునం దైదుకత్తుల మెరకభూమిని ధర్మముచేసిరి. వీరు నిత్యశివపూజాధురంధరులైనశివభక్తు లయ్యును, శివకేశవులయెడ భేదభావము లేనివారగుట విష్ణుభక్తులు గూడ నైరి. ఆకారణంబున వీరిజమీలోనివగు పెండ్యాల, కొనతమాత్మకూరు, బొబ్బిళ్ళపాడు అను గ్రామంబులందు శివాలయంబులనే గాక విష్ణ్వాలయంబులనుగూడఁ బ్రతిష్ఠించిరి. అయినను:— తే. గీ. జగదధీశ్వరుఁ డగు మహే ♦ శ్వరుని యందు । సకలజగదంతరాత్ముఁడౌ ♦ శార్ఙ్గి యందు । భేదవిజ్ఞాన మెయ్యెడ ♦ లేదు మాకు । నైనఁ దరుణేందుశేఖరు ♦ నందు భక్తి॥ యను భర్తృహరియోగీంద్రుని మతానుసారంబుగ శివకేశవులం దభేదబుద్ధి గలిగియుండియును శివభక్తియం దెక్కుడుప్రీతిగలవారగుటచే నిత్యశివపూజాధురంధరులై విభూతిరుద్రాక్షమాలికలచే నలంకృతులై విరాజిల్లుచుందురు. మఱియుఁ బూర్వోక్తదేవాలయంబులకై యీనామ లేర్పఱచి యభివృద్ధికి వచ్చున ట్లొనర్చిరి. ఇంతియేగాక ముక్త్యాలలోఁ గల తమయిష్టదైవం బగు శ్రీముక్తీశ్వరస్వామికి వినుకొండతాలూకాలోఁ గల గుమ్మడంపాడుగ్రామములో నొక సగపాలుభూమిని, దూబాడుగ్రామములో నొకకొంతభూమిని గొని యీనాముగ నిచ్చిరి. ఒక కొండపైఁ గట్టబడిన వేదాద్రికోవెల నధిరోహించు తైర్థికాళికి సౌఖ్యద మగునట్లు కృష్ణానదీతీరంబున నుండి యాలయద్వారము వఱకును గల యష్టోత్తరశతసోపానతతిని మిగుల దృఢంబుగఁ గట్టించిరి. వెండియు:—

"తే.గీ. తరుతటాకాదిసంతతుల్ ♦ ధరణి నెచట
నిలిపి రచట నె యుండు వా ♦ నికిని గృతిము
ఖంబున నె విశ్వవిఖ్యాతి ♦ గాంచుఁ గృతియె
సంతతివతంస మదిమాకు ♦ సంఘటింపు॥"

అని మున్ను దిరుమలరాయభూపాలుఁడు గోరినట్లే మన యీ శ్రీరాజాగారును గోరి సంస్కృతమునుండి యనువాదింపఁబడిన "ద్రౌపదీవస్త్రాపహరణము, కంచిమాహాత్మ్యము" అను గ్రంథద్వయంబునకుఁ గృతిపతులై:—

"క॥ ధర్మములలోన నుత్తమ। ధర్మముగాన్యము నిజంబు। ధర నెవ్వనికా
ధర్మముచేకుఱునతఁడసు। ధర్మనువసియించుఁ బెక్కు దైవతయుగముల్॥"

అను శాస్త్రానుసారంబుగ నిష్కల్మషచారిత్రులై శివసాయుజ్యంబు నొందిరి. ఈ భవానీముక్తీశ్వరప్రసాదనాయఁడుగారు వారి కుశాగ్రబుద్ధిచే గృహచ్ఛిద్రంబులు గలుగకుండునట్లు జేసిన యేర్పాటు ననుసరించి చినకుమారుఁడుగా రగు వేంకటాద్రినాయఁడుగారికి తమ జమీనుండి రెండుగ్రామంబులను దానవిక్రయాదుల కర్హతలే కుండునట్లనఁగ వారసులు లేకుండినయెడలఁ దిరిగి జమీలోనే సంక్రమించునట్లొసంగి తనరాజ్యభారమును విరమించుకొనిరి.

వీరియనంతరమున నుమామహేశ్వరప్రసాదనాయఁడుగారు పరిపాలనంబునకు వచ్చిరి. వీరును దమతండ్రిగారి శిక్షణమునఁ బెఱిగినవారగుటచే నెంతయుఁ బాలనక్రమంబున నసమాననైపుణ్యంబును గలిగి యెస్టేటును మంచి యభ్యున్నతస్థితికిఁ దేఁగలిగిరి. ఐదుసంవత్సరముల కొకసారి పట్టాలను దిరిగి వ్రాసికొనుపద్ధతి యుండుటచేఁ బ్రతితడవయును శిస్తును హెచ్చించుచు జమీ నభివృద్ధిపఱచుకొను చుండినను రైతులకు శ్రీవారి సహజానురాగకారణమున వారివిశ్వాసంబును నభివృద్ధి జెందఁజొచ్చెను. ఈ యుమామహేశ్వరప్రసాదనాయఁడుగారి రాజ్యకాలంబున నైజామురాజ్యము నందు గల వీరి సంస్థానభూములను గుఱించి కలిగిన వ్యవహారికవిషయాదులందు విశేషధనము హెచ్చింప వలసివచ్చినను మంచిధనాఢ్యులుగనే పరగణింపఁ బడిరి. వీరితండ్రిగారివలె వీరును నిత్యశివపూజాధురంధరులును మతాభిమానులును నగుచుఁ బెక్కుధర్మకార్యంబు లొనర్చిరి. వీరితండ్రిగారికాలంబులోఁ గట్టఁబడిన వయి కృష్ణాతీరంబునుండి వేదాద్రికొండపైఁ గల నృసింహస్వామియాలయంబువఱకును గల సోపానవితానంబు విశేషధనవ్యయంబుచేఁ దిరిగి దృఢంబుగ నుండునట్లు సంస్కరింపఁబడెను. మఱియు వీరు వేదాద్రిలోని దేవాలయంబును జక్కగా బాగుచేయించి యాత్రికులకు సౌఖ్యంబును గలిగించిరి. వీరు కాశీయాత్రను సేవించి తిరిగి వచ్చునప్పు డచ్చటనుండి యొక బ్రహ్మాండమైనవిగ్రహంబును గొని



వచ్చి చింతలపాటునందుగల యొక దేవాలయంబు నందు బ్రతిష్ఠించి మనోహరంబులైనయుత్సవాదులను జరిగింపుచుండిరి. శ్రీరాజాగారు తమయవసానప్రాప్తంబునకుముందే తమసోదరుఁడగు శ్రీరాజా వేంకటాద్రినాయఁడుగారి పుత్రరత్నం బనఁ దగు శ్రీ చంద్రమౌళీశ్వరప్రసాదనాయఁడుగారిని దత్తపుత్రునిగ స్వీకరించి పిమ్మటఁ గొంతకాలంబునకనఁగ 1901వ సంవత్సరము నవంబరు 15వ తేదిని దమజీవయాత్రను విరమించిరి.

అంతట శ్రీరాజా చంద్రమౌళీశ్వరప్రసాదనాయఁడుబహద్దరుగారు రాజ్యారంభమునకు వచ్చిరి. వీరికి యాంధ్రభాషాభిలాష మెండు. ఈ శ్రీరాజాగారాయుర్వేదౌషధంబుల నెక్కుడు వ్యయప్రయాసలచే శాస్త్రానుసారంబుగఁ జేయించి రోగపీడితు లగువారికి శక్తివంచనలేకుండఁ బంచిపెట్టుచుఁ దమకుఁ గల పరోపకారపరాయణత్వంబును వెల్లడింపుచుండిరి. ఈ రాజాగారు దేవరకోటజమీందారుగా రగు శ్రీమల్లిఖార్జునప్రసాదనాయఁడుబహదరుగారి ద్వితీయపుత్రికను బరిణయమైరి. మఱియుఁ జల్లపల్లి కుమారరాజాగా రగు శ్రీ యంకినీడుప్రసాదబహదరు, బి.ఏ., గా రీచంద్రమౌళీశ్వరప్రసాదనాయఁడుగారి తృతీయసోదరీరత్నంబును 1904వ సంవత్సరంబున వివాహమైరి.

వీరి పెంపుడుతండ్రిగారగు శ్రీయుమామహేశ్వరప్రసాదనాయఁడుబహదరుగారి కాలంబునఁ దటస్థించిన ఋణమును దీర్ప నెంచి 1902—03 సంవత్సరప్రాంతమున మామూలుగ ముచ్చిలికాపట్టాలను దిరిగి వ్రాసియిచ్చు సందర్భమున నూటి కిరువదియైదువంతున శిస్తును హెచ్చించిరి. ఈకారణంబున రైతులయందించుక వ్యతిరేకభావములు దటస్థించెనుగాని యవి దీర్ఘకాలము నిలిచియుండలేదు. ఈజమీలో, భూమిని హక్కుపఱచుకొని మామూలుశిస్తుమాత్ర మిచ్చు నట్టిపద్ధతిగాక భూస్వాములసమ్మతి లేకుండినచో నియమితకాలానంతరమున భూమిని వదలుకొనవలసినపద్ధతి యగుటచే రైతులు తమభూస్వాముల నతిక్రమించి నడుచుకొన వలనుపడదు. ఇట్టిపద్ధతు లుండినను శ్రీ చంద్రమౌళీశ్వరప్రసాదనాయఁడుగారు తమరైతుల నెన్నఁడును నిరసనభావమున జూడ కుండుటయేగాక యెక్కుడు దయార్ద్రహృదయులయి

యాదరభావంబునఁ జూచుచుండుటచే రైతులెల్లప్పుడును మిగుల భక్తివిశ్వాసంబులతో సేవింపుచుందురు. వీరి కుశాగ్రబుద్ధిచేతను, బరిపాలనయందలిదక్షత్వముచేతను దివానుగాని మేనేజరుగాని లేకయే స్వయముగా జమీని బాలించుకొనుచుండిరి.

ఈజమీ మిగుల దట్టమైన యడవులచేఁ గప్పఁబడి యుండుటచేఁ జాల భాగము బీడుగా నుండెను. కాని శ్రీవారి కాలంబునం దాభూమిని సుక్షేత్రంబుగ నొనర్పఁ దలఁచి తగు ప్రయత్నంబులకు జాగ్రత్తను దీసికొనిరి. ఈవిధముగా వ్యవసాయాభివృద్ధికి మిగుల శ్రద్ధదీసికొని తమయెస్టేటునకును, రైతులకును గడు నభ్యున్నతస్థితిని గల్పించిరి. విద్యాభివృద్ధికై శ్రీవారి పూర్వీకులు సలిపినట్లే యీరాజాగారుకూడ ముక్త్యాలయం దొక ప్రైమరీస్కూలును స్థాపించిరి. నందిగామయందు నెలకొల్పఁబడిన పాఠశాలాభవనము శ్రీవారి యౌదార్యముననే స్థాపింపఁ బడినది. ఈభవనమునకై యిరువదివేల రూప్యములు వ్యయపఱచిరి. ముక్త్యాలలోను, కంచెలలోను గల సౌధవితానమును సంస్కరించి మఱికొన్ని నూతనభవనములకై యేబదరువదివేలరూప్యములకుఁ బైన వెచ్చించిరి. శ్రీరాజాగారికి చిత్రలేఖనమునం దత్యంతాభిలాషగలదు. ఇందుకొఱకై చిత్రలేఖనమునం దత్యంతసామర్థ్యంబుగలిగి ప్రఖ్యాతినిగాంచిన శ్రీ రామమోహనరావుగారిని సకుటుంబముగా శ్రీ రాజాగారు తమసంస్థానమునం దుంచుకొని, చిత్రలేఖనకళాకౌశల్యముచేఁ దమహర్మ్యరాజము నలంకరింపఁ జేయుచున్నారు.

ఇటులనే శ్రీ రాజాగారు ధనవ్యయమును బాటింపక సంస్థానమునకు శ్రేయోభివృద్ధికరములగు నెన్నియో పనులను జేయింపుచు, జననుతి కెంతయుఁ బాత్రులైరి. వీరు పర్వదినంబులందును, దదితరసమయము లందును నన్నదానాదికముల నత్యంతసంతృప్తిగఁ జేయుచుండిరి. శ్రీ రాజాగారికిని వారికుటుంబమునకును భగవదనుగ్రహంబుచే శాశ్వతాయురారోగ్యంబులు లభించుఁగాక.